ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
బుధవారం 26 మార్చి 2025




వివాదానికి కారణమైన స్థలం


తొలుత నిర్లక్ష్యం...
ఆపై ఓవరాక్షన్
- ఫిరంగిపురం స్థల వివాదంలో అతిగా స్పందించిన సీఐ
- ఆందోళన కారులు రాళ్లు రువ్వుతూ, కర్రలతో సీఐ వెంటబడిన వైనం

6

నాటి హామీ.. నేడు అమలు

ప్రజా సమస్యల పరిష్కారం దిశగా ఆంధ్రజ్యోతి వినూత్నంగాచేపట్టిన అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా.. కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తోంది. ఏళ్లుగా అపరిష్కృతంగా సమస్యలపై ఆంధ్రజ్యోతి వేదికగా ప్రజలు గళం వినిపించగా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వాటి పరిష్కారానికి శ్రీకారం చుడుతున్నారు.

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..






వినుకొండలోని కొట్నాల్లవీధి, గాయత్రినగర్‌లోని సీసీ రోడ్డు, మురుగు కాల్వ పనుల శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మున్సిపల్ చైర్మన్ దస్తగిరి, కమిషనర్ సుభాష్‌చంద్రబోస్

జనవరి 28న వినుకొండ మున్సిపల్ పరిధిలోని కొట్నాల్లవీధి, గాయత్రినగర్‌లో ఆంధ్రజ్యోతి అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా.. కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వీధివీధినా పర్యటించగా స్థానికులు తామెదుర్కొంటున్న సమస్యలను వివరించి, అర్జీలను కూడా ఇచ్చారు. ఆ సమయంలో ఆయన ఆయా సమస్యలపై స్పందించి పరిష్కారానికి హామీ ఇచ్చారు. నాడిచ్చిన హామీ మేరకు ఆయా ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలకు నిధులను మంజూరు చేయించి మంగళవారం వాటికి శంకుస్థాపనలు కూడా చేశారు. ఏళ్లుగా తాము ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ జీవీని సత్కరించారు. రూ.62.60 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు.. మురుగు కాల్వల నిర్మాణ పనుల ప్రారంభంపై హర్షం వ్యక్తం చేశారు.


జీవీ ఆంజనేయులను సత్కరిస్తున్న కౌన్సిలర్ వాసిరెడ్డి లింగమూర్తి, మాజీ కౌన్సిలర్ వాసిరెడ్డి హనుమంతరావు, స్థానికులు

- అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా పనులకు శంకుస్థాపనలు
- వినుకొండ మున్సిపాల్టీలోని కొట్నాల్లవీధి, గాయత్రినగర్‌లకు మహర్దశ
- ఆంధ్రజ్యోతి వేదికగా సమస్యలపై ప్రజాగళం.. పరిష్కారానికి మార్గం సుగమం
- రూ.62.60 లక్షలతో రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణాలకు శంకుస్థాపన
- ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులను సత్కరించిన కాలనీ వాసులు

వినుకొండ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఆంధ్రజ్యోతి గొంతుకగా మారేందుకు అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోంది. ప్రజాప్రతినిధులను, అధికారులను ప్రజల వద్దకే తీసుకువెళ్లి సమస్యలు చెప్పుకునే అవకాశం కల్పించే క్రమంలో జనవరి 28న వినుకొండ మున్సిపాల్టీలోని 23, 31 వార్డుల్లో అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా.. కార్యక్రమాన్ని నిర్వహించింది. ఆంధ్రజ్యోతి వేదికగా గాయత్రినగర్.. కొట్నాల్ల వీధిలో జరిగిన కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు హాజరు కాగా ప్రజలు సమస్యలను తెలియజేసి అర్జీలను అందజేశారు. నాడు హామీ ఇచ్చినట్లుగా ఆయా సమస్యల పరిష్కారానికి జీవీ నేడు నడుంకట్టారు. ఆయా కాలనీల్లో రూ.62.60 లక్షలతో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణ పనులకు మంగళవారం శంకుస్థాపనలు చేశారు. ఆంధ్రజ్యోతి నిర్వహించిన కార్యక్రమం ద్వారా తమ కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టడంపై స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రగతి పనులకు శంకుస్థాపన చేసిన జీవీకి మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి చేసి చూపిస్తాం : జీవీ

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వినుకొండ (మిగతా 8వ పేజీలో)

గాయత్రినగర్‌లో రూ.45 లక్షలతో వసతులు

కొత్తగా ఏర్పాటైన గాయత్రినగర్‌లో గత ఐదేళ్లలో ఒక్క అభివృద్ధి పని కూడా చేపట్టలేదు. అంధ్రజ్యోతి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న జీవీ వీధివీధిలో పర్యటించారు. మహిళలు ఎక్కడికక్కడ సమస్యలకు సంబంధించిన అర్జీలను అందజేసి తమ ఇబ్బందులను తెలిపారు. నగర్ కాల్వకట్ట మొదటి వీధిలో సిమెంట్ రోడ్డు.. మురుగు కాల్వలు, ఎన్‌ఎస్పీ కాల్వపై బ్రిడ్జి నిర్మించాలన్నారు. మరో వీధిలో రోడ్డు, డ్రెయిన్, తాగునీటి పైపులైన్, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఆ రోజు ఇచ్చిన హామీ మేరకు జీవీ మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టారు. రూ.45 లక్షలతో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆయా పనులకు శంకుస్థాపనలు చేశారు. తాగునీటి సమస్యలను పరిష్కరిస్తానని తాజాగా హామీ ఇచ్చారు.


రూ.17.60 లక్షలతో కొట్నాల్లవీధిలో పనులు

పేద ముస్లిం మైనార్టీ వర్గాలు నివసించే కొట్నాల్లవీధి ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధికి నోచుకోలేదు. తాగునీటి పైపు లైన్ కోసం సిమెంట్ రోడ్డు పగలగొట్టి వదిలేశారు. మురుగు కాల్వలు లేక ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. తాగునీటి సమస్యతో అల్లాడుతున్నారు. ఆయా సమస్యలను ఆంధ్రజ్యోతి వేదికగా జీవీకి వారు గతంలో తెలిపారు. ఆ వీధిలో పర్యటించిన జీవీ ఆయా సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడిన జీవీ కొట్నాల్లవీధి అభివృద్ధికి బాటలు వేశారు. రూ.17.60 లక్షలతో ఆ ప్రాంతవాసులు కోరిన ప్రగతి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రజల సమక్షంలోనే వారడిగిన పనులకు శంకుస్థాపన చేశారు.

పరీక్షల వేళ.. పెరిగిన కోతలు

- విద్యుత్ సరఫరాలో అంతరాయాలు
- గ్రామీణ ప్రాంతాల్లో పెరిగిన వైనం
- పరికరాల కొరత అంటున్న సిబ్బంది

ఎండలు మండుతోన్న కొద్ది విద్యుత్ సరఫరాలో అంతరాయాలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా జిల్లా కేంద్రాల్లో మినహా మండల, గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఎక్కువవుతున్నాయి. పగటి పూటే అధికం గా విద్యుత్ అంతరాయాలుంటున్నాయి. ఇక రాత్రి సమయాల్లో ఎప్పుడు అంత రాయాలు వస్తాయో తెలియని పరిస్థితులు నెలకొంటున్నాయని గ్రామీణ ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. అసలే పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు , మరో వైపు మండుతోన్న ఎండలు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవు తుంటే మరో వైపు విద్యుత్ కోతలు ప్రజలకు ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తున్నాయి.



గుంటూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిధిలోని గుంటూరు సర్కిల్ తెనాలి డివిజన్‌లోని పలు సెక్షన్‌లోనూ విద్యుత్ అంతరాయాలు నెలకొంటున్నాయి. ఇక బాపట్ల సర్కిల్ పరిధిలోని బాపట్ల డివిజన్‌లో కర్లపాలెంలోని నందిరాజుతోట, యాజిలి, నల్లమోతు వారిపాలెం, కంకటపాలెం, పీవీపాలెం, అమృతలూరు, వేమూరు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలు ఉంటు న్నట్లు సమాచారం. ఇక పల్నాడు జిల్లా సర్కిల్ పరిధి లోనూ రాజుపాలెం, నాదెండ్ల, దుర్గి, కారంపూడి ఆయా ప్రాంతాల సెక్షన్‌ల పరిధిలో కూడా విద్యుత్ అంతరా యాలు ప్రజలకు ప్రత్యక్ష నరకాన్ని చూపుతున్నాయి. రాజుపాలెం మండలం ఇనుమెట్ల గ్రామంలో అయితే కొన్ని సార్లు పగలంతా విద్యుత్ సరఫరా (మిగతా 8వ పేజీలో)

వృద్ధి లక్ష్యం..15.82%

- జిల్లా తలసరి ఆదాయం రూ.2,16,505
- ఉద్యాన పంటల ద్వారానే అధిక ఆదాయం
- జిల్లా ఆదాయం.. అవసరాలపై నివేదిక సిద్ధం
- కలెక్టర్ల సదస్సులో నేడు కలెక్టర్ అరుణ్‌బాబు నివేదన


సదస్సులో ఎస్పీ కంచి శ్రీనివాసరావు, కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా వార్షిక ఆదాయ వృద్ధిలక్ష్యం 15.82 శాతం. తలసరి ఆదాయం రూ.2,16,505. ప్రధానంగా ఉద్యాన పంటల ద్వారానే అధిక ఆదాయం.. ప్రభుత్వం నిర్దేశించింది. జిల్లా ప్రగతి, ఆదాయంపై అరుణ్‌బాబు బుధవారం కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో నివేదించనున్నారు. వెలగపూడి సచివాలయంలో మంగళవారం ప్రారంభమైన సదస్సుకు కలెక్టర్ హాజరయ్యారు. బుధవారం జిల్లాకు సంబంధించి కలెక్టర్ ప్రత్యేకంగా ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. టీడీపీ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంగళవారం ప్రారంభమైన రెండు రోజుల మూడో కలెక్టర్ల సదస్సు తొలిరోజున వివిధ శాఖల అధికారులు జిల్లా ఏ స్థానంలో ఉన్నది వంటి వివరాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా నివేదించారు. ఆదాయంతో పాటు జిల్లా అవసరాలపై కూడా కలెక్టర్ నివేదిక రూపొందించారు. ఈ ప్రకారం.. 2025-26 ఆర్థిక సంవ త్సరానికి జీడీవీఏ రూ49,105 కోట్లుగా, జీడీడీపీ రూ.53,488గా అంచనా వేశారు. జీడీవీఏ వృద్ధి 15.53 శాతం, జీడీడీపీ వృద్ధి 16.11 శాతంగా నమోదు చే శారు. జిల్లాలో సర్వీస్ రంగం ద్వారానే అధిక ఆదాయం వస్తుం దని అంచనా వేశారు. వ్యవ సాయ రంగం ద్వారా రూ.8,600 ఆదాయం వస్తుందని లెక్కకట్టారు. ఉద్యాన పంటల ద్వారా రూ.6794 కోట్లు ఆదాయం వస్తుందని, ఇందులో మిరప వంతు అధికంగా ఉంది. ఏటా లక్ష ఎకరాలకు పైగా మిరప పంటను రైతులు సాగు చేస్తున్నారు. ఉద్యాన ఆదాయవృద్ధి 15.61 శాతంగా నమోదు చేశారు. అన్ని రంగాల కంటే పశువులు, మాంసాహారం, పాల ఉత్పత్తుల ద్వారా రూ.8147 కోట్లు ఆదాయం లక్ష్యంగా నిర్దేశించారు. చేపలు, అక్వాసాగు ద్వారా రూ.2139 కోట్లు ఆదాయం నమోదైంది. జిల్లాలో అక్రమ మైనింగ్ జరుగుతున్నా రూ.1701 కోట్లు ఆదాయం అంచనా వేయడం గమనార్హం. చట్టప్రకారం చర్యలు తీసుకుంటే మైనింగ్ ఆదాయం భారీగానే పెరిగే అవకాశం ఉంది. విద్యా రంగం ద్వారా రూ.4679 కోట్లు, రియల్ వ్యాపారం నుంచి రూ.4753 కోట్లు ఆదాయం అంచనాగా ఉంది. నిబంధనలు కచ్చితంగా అమలు చేస్తే ఈ రెండు రంగాల నుంచి ఆదాయం గణనీయం పెరిగే అవకాశం ఉంది.

వరికపూడిసెలకు రూ.14.81 కోట్లు అవసరం

గోదావరి పెన్న నదుల అనుసంధానం పనులు చేపట్టేం దుకు భూసేకరణకు నిధులు విడుదల చేయాలని కలెక్టర్ సదస్సులో కోరనున్నారు. వరికపూడిసెల ప్రాజెక్టుకు సంబం ధించి అటవీశాఖకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉంది. ఇందుకు రూ.14.81 కోట్లు అవసరం. గురజాల నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొం దించారు. అమరావతిలో బుద్ధుని విగ్రహం ఆధునికీకరణ, మున్సిపాల్టీలు, నగర పంచాయతీల పరిధిలో పది అన్న క్యాంటీన్లు మంజూరు చేయాలని ప్రతిపాదించనున్నారు. నరసరావుపేటలో నిరుపయోగంగా ఉన్న రాజీవ్ స్వగృహ భవనాలను వినియోగంలోకి తీసుకొచ్చే అంశాన్ని కూడా కలెక్టర్ తన నివేదికలో ప్రస్తావించారు.

బుగ్గవాగు సామర్థ్యం
పెంపునకు కృషి

- ప్రాజెక్టు ఆధునికీకరణే లక్ష్యంగా పనులు
- ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు

రెంటచింతల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): బుగ్గవాగు రిజర్వాయర్‌లో నీటి నిల్వ సామర్థ్యాన్ని 3.4 టీఎంసీల నుంచి 7 టీఎంసీలకు పెంచడానికి కృషి చేస్తున్నట్లు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు తెలిపారు. మంగళవారం బుగ్గవాగు రిజర్వాయర్, క్రస్ట్ గేట్లను పరిశీలించారు. బుగ్గవాగు సామర్థ్యం పెంచేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని అందుకు అనుగుణంగా అధికారులు డీపీఆర్ తయారు చేయాలన్నారు. 11 లక్షల 17 వేల ఎకరాలకు సాగునీరు అందించే రిజర్వాయర్‌లో పూడిక పేరుకుపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయిందన్నారు. ఫలితంగా రైతులకు అగచాట్లు తప్పడం లేదని తెలిపారు. బుగ్గవాగు ప్రాజెక్టును ఆధునికీకరించడమే తమ లక్ష్యమన్నారు. 1967లో ఏర్పాటు చేసిన క్రస్ట్ గేట్లు తుప్పు పట్టి మొరాయిస్తుండటంతో తరచూ సాగునీటి విడుదలకు ఆటంకాలు తలెత్తుతున్నాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వం కనీసం గ్రీజ్ కూడా పెట్టకుండా అలానే వదిలేసిందన్నారు. బుగ్గవాగు చుట్టూ 7 కి.మీ పరిధిలో కరకట్టను నిర్మించి బలోపేతం చేయడంతో పాటు నిరుపయోగం ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్‌ను వాడుకలోకి తెస్తామన్నారు. గురజాల, మాచర్ల ఎమ్మెల్యేలు యరపతినేని, బ్రహ్మానందరెడ్డిల నేతృత్వంలో త్వరలో ప్రతినిధి బృందం జలవనరులశాఖ మంత్రి రామానాయుడ్ని కలవనున్నదన్నారు. ఈ కార్యక్రమంలో డీసీ చైర్మన్లు చావా రామారావు, యాగంటి రామారావు, డీఈలు మురళీధరావు, లింగమూర్తి, ఏఈలు టి.శివయ్య, పి.సుధాకరరావు, మాజీ జడ్పీటీసీ శ్యామ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.


డ్యాంను పరిశీలిస్తున్న ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కాంతారావు



90 శాతం టెండర్లు.. 15 రోజుల్లో పనులు

సీఆర్డీఏ కార్యాలయంలో పనులను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

- త్వరలో అందుబాటులోకి రాజధాని భవనాలు
- డెడ్‌లైన్ ప్రకారం పూర్తి చేయాలని నిర్దేశించాం
- ప్రభుత్వ భవనాల పనుల పరిశీలనలో మంత్రి నారాయణ

8

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.25 (బుధవారం సాయంత్రం)
సహరి : 4.51 (గురువారం ఉదయం)

మిర్చి రైతుల నిరసన

ధర తగ్గించడంతో రోడ్డెక్కిన రైతులు


మిర్చి యార్డు ఎదుట రాస్తారోకో చేస్తున్న రైతులు

8

సాంకేతిక నైపుణ్యాలతో ఉద్యోగావకాశాలు

ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

గుంటూరు (విద్య)మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకుంటే మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సాధించవచ్చునని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. నల్లపాడులోని ఎంటీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం జరిగిన ఉద్యోగ విజయోత్సవ, వార్షికోత్సవంలో ఆలపాటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాలిటెక్నిక్



విద్యార్థికి నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

కళాశాలలో చదివిన విద్యార్థులు ఎంతో నైపుణ్యంతో ఉంటారని వారికి అదనపు సాంకేతిక నైపుణ్యాలు నేర్చుకునే అవకాశం కల్పిస్తే అనేక రంగాల్లో రాణిస్తారన్నారు. కార్యక్రమంలో సాంకేతిక విద్యాశాఖ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్.ఎంఏవీ రామకృష్ణ, ఎంటీటీఎస్ ప్రధానాచార్యులు తాళ్లూరి శేఖర్ తదితరులు మాట్లాడుతూ చివరి సంవత్సరం పాలిటెక్నిక్ చదువుతున్న 262 మంది విద్యార్థులకు గాను 252 మంది వివిధ కంపెనీలలో ప్రాంగణ నియామకాల ద్వారా ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. వార్షిక వేతనం రూ.1.8 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు ఉన్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంటీటీఎస్ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ కే హరీష్, వసంత ఇండస్ట్రీస్ వైస్ ప్రెసిడెంట్ కొండేపాటి హనుమంతరావు, రిటైర్డ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీవీ శేషా చలపతి తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ దూరవిద్య ఎంబీఏ అర్హత పరీక్షా ఫలితాల విడుదల

పెదకాకాని, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో దూరవిద్య కేంద్రం ఈనెల 23న నిర్వహించిన ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల ప్రవేశాల అర్హత పరీక్షా ఫలితాలను మంగళవారం ఇన్‌చార్జి వీసీ ఆచార్య కే గంగాధరరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా పరీక్షల ఇన్‌చార్జి కోఆర్డినేటర్ ఆచార్య డి. రామచంద్రన్ మాట్లాడుతూ ఎంబీఏ కోర్సుకు 285 మంది దరఖాస్తు చేసుకోగా 257 మంది అర్హత సాధించారని, ఎంసీఏ కోర్సుకు 57 మంది దరఖాస్తు చేసుకోగా 54 మంది అర్హత సాధించినట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా దూరవిద్య కేంద్రం ఇన్‌చార్జి డైరెక్టర్ ఆచార్య వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పరీక్షల ఫలితాలను దూర విద్యా కేంద్రం వెబ్ సైట్‌లో పొందుపరిచినట్లు వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఓఎస్డీ రవికుమార్, దూరవిద్య కేంద్రం అధికారులు కృష్ణవేణి, నేలపాటి నాగేశ్వరరావు, ఎల్ఎస్ రాంబాబు, జె.శ్రీనివాసరావు, వై.రాధాకృష్ణ పాల్గొన్నారు.

తొలుత నిర్లక్ష్యం... ఆపై ఓవరాక్షన్

- ఫిరంగిపురం స్థల వివాదంలో అతిగా స్పందించిన సీఐ
- రివాల్వర్‌తో యువకుడుపై దాడి... కాల్చేస్తానంటూ ఆందోళనకారులకు హెచ్చరికలు
- రెచ్చగొట్టేలా వ్యవహరించడం వల్లే ఉద్రిక్త పరిస్థితి
- ఆందోళనకారులు రాళ్లు రువ్వుతూ, కర్రలతో సీఐ వెంటబడిన వైనం

గుంటూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) :: ఫిరంగిపురంలోని శాంతిపేటలో స్థల విషయంలో నెలకొన్న వివాదాన్ని అంచనా వేయడంలో స్థానిక సీఐ రవీంద్రబాబు విఫలమయ్యారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం తీర్మానించిన గ్రామకంఠం స్థలంలో ఇప్పటికే రెండు సెంట్లు కబ్జాకు గురైందని.. మరో రెండు సెంట్లు స్థలాన్ని కూడా కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని కాలనీవాసులు తొలుత ఫిరంగిపురం స్టేషన్ వెళ్లి సిఐకు ఫిర్యాదు చేశారు. గేర చిన్ని కుమార్ అనే వ్యక్తి ఆ స్థలంలో పోల్స్ పాదుతున్నాడని, ఆ స్థలం కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని తొలుత కాలనీవాసులు సీఐను కలిసి విజ్ఞప్తి చేశారు. అయితే సిఐ రవీంద్రబాబు అందుకు భిన్నంగా వ్యవహరించారు. ఏదైనా ఉంటే తహసీల్దార్ కలిసి తేల్చుకోవాలని, తనకు సంబంధం లేదని చెప్పారు. రాత్రివేళ తహసీల్దార్ అందుబాటులో ఉండరని, కనీసం రేపు తహసీల్దార్‌ను కలిసి ఫిర్యాదు చేసే వరకైనా అందులో ఎటువంటి నిర్మాణాలు జరగకుండా చూడాలని కోరినా ససేమిరా అంటూ సీఐ వారిని అక్కడ నుంచి పంపించేశారు. దీంతో కాలనీవాసులంతా అక్కడికి వెళ్లి చిన్ని కుమార్ పోల్స్ పాతకుండా అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో వివాదం చోటుచేసుకుంది. విషయం పోలీసుల దృష్టికి రావడంతో తొలుత కానిస్టేబుల్, ఏఎస్ఐను అక్కడికి పంపారు. వారు ఇరు వర్గాలతో చర్చించి చిన్ని కుమార్ ఎటువంటి నిర్మాణాలు చేపట్టకుండా నియంత్రించ గలిగినట్లయితే వివాదం జరిగి ఉండేది కాదు. పెద్ద సంఖ్యలో కాలనీ వాసులంతా అక్కడకు చేరిన విషయం తెలుసుకున్న తర్వాత అక్కడకు వెళ్లినప్పటికీ ఇరు వర్గాలతో సంయమనంతో వ్యవహరించి సామరస్యంగా ఇరువర్గాలను అక్కడి నుంచి పంపాల్సి ఉన్నప్పటికీ సిఐ రవీంద్రబాబు అతిగా స్పందించారు. కమ్యూనిటీ స్థలం కబ్జా కాకుండా కాపాడాలంటూ నిరసన తెలియజేస్తున్న వారిలో ఒకరైన పసల అఖిల్‌ను రివాల్వర్‌తో కొట్టడంతో ఆయనకు రక్త గాయం అయింది. తాము ముందుగా స్టేషన్‌కి వెళ్లి పోల్స్ పాతకుండా స్థలం కబ్జాకు గురి కాకుండా చూడాలని కోరితే పట్టించుకోకపోగా తాము నిరసన తెలియజేస్తుంటే వచ్చి ఇరు వర్గాలను నియంత్రించకపోగా తమపై దాడి చేసి రివాల్వర్‌తో కొట్టడం ఏమిటి అంటూ స్థానికులు రెచ్చిపోయారు. సిఐ పై దాడికి యత్నించారు. ఈ సందర్భంగా జరిగిన తోపులాటలో సీఐ పక్కనే ఉన్న కాలువలో పడిపోయారు. ఆందోళనకారులు రెచ్చిపోతుండటంతో సీఐ కూడా అగ్గికి ఆజ్యం పోసినట్లు రివాల్వర్ తీసి కాలుస్తానంటూ బెదిరించడంతో వారు మరింత రెచ్చిపోయారు. అయినప్పటికీ సీఐ రివాల్వర్ చేతిలో పట్టుకొని బెదిరిస్తుండడంతో ఆందోళనకారులు రాళ్లు విసురుతూ, కర్రలు తీసుకొని వెంట పడగా ఆయన తుపాకీ చూపిస్తూ వెనక్కు నడుస్తూ ఘటనా స్థలం నుంచి వెళ్లే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ఆందోళనకారులు రాళ్లు రువ్వుతూ, కేకలు వేస్తూ వెంటపడంతో అటుగా వచ్చిన ద్విచక్రవాహం ఎక్కి పారిపోయారు. దీంతో రెచ్చిపోయిన ఆందోళనకారులు పెద్ద సంఖ్యలో గుంటూరు - కర్నూలు రహదారిపై బైఠాయించి సోమవారం అర్ధరాత్రి రాస్తారోకో చేయడంతో ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది. మరోవైపు ఆందోళన కారుల నిరసనతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. అక్కడ ఏం జరుగుతుందో అర్థం కాక జిల్లా కేంద్రం నుంచి ఎస్పీ ఆదేశాల మేరకు పెద్ద సంఖ్యలో పోలీసు బలగాలు, తుళ్లూరు డీఎస్పీ, నిఘా విభాగం అధికారులు హుటాహుటిన అర్ధరాత్రి వేళ ఫిరంగిపురం చేరుకొని పరిస్థితి చేయి దాటకుండా శాంతియుతంగా పరిస్థితిని అదుపులోకి తీసుకు రాగలిగారు.



తహసీల్దార్ ప్రసాదరావుకు వినతిపత్రం అందజేస్తున్న శాంతిపేట వాసులు

అసలు స్థల వివాదం ఏమిటంటే...

ఫిరంగిపురంలోని శాంతిపేటలో నాలుగు సెంట్లు ఖాళీ స్థలం ఉంది. గతంలో ఆ స్థలంలో గ్రామదేవత పోలేరమ్మ విగ్రహాలు ఉండేవి. కాలక్రమంలో ఆలయానికి ఆదరణ కొరవడడంతో శిథిలావస్థకు చేరింది. చివరకు అందులో ఉన్న విగ్రహాలను కూడా తొలగించారు. అయితే ఆ నాలుగు సెంట్లు స్థలంలో గేరా చిన్ని కుమార్ అనే వ్యక్తి రెండు సెంట్ల స్థలాన్ని ఆక్రమించి ఇల్లు కట్టుకున్నారు. దీంతో కాలనీవాసులు మిగిలిన రెండు సెంట్ల స్థలంలో కాలనీ అంతటికీ ఉపయోగపడేలా కమ్యూనిటీ హాలు నిర్మించాలని నిర్ణయించుకున్నారు. అయితే ఆ స్థలం తనదేనని కమ్యూనిటీ హాల్ ఎలా నిర్మిస్తారంటూ చిన్ని కుమార్ కొద్దిరోజులుగా కాలనీవాసులతో గొడవ పడుతున్నాడు. అంతేగాక ఆయన పోలీస్ స్టేషన్లో కాలనీవాసులుపై ఫిర్యాదు కూడా చేశాడు. అయితే కాలనీవాసులు మాత్రం ఇది ప్రభుత్వ భూమి అని, ఇది గ్రామకంఠమని ఇప్పటికే రెండు సెంట్లు ఆక్రమించాడని మిగిలిన రెండు సెంట్లు కూడా కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్నాడని అందులో ఎట్టి పరిస్థితిలో కమ్యూనిటీ హాల్ నిర్మించాల్సిందేనని పట్టుపట్టారు. దీంతో ఈ వ్యవహారం ఇది మరింత వివాదాస్పదంగా మారింది.

రూ.2వేల కోట్లకు పైగా సంగం టర్నోవర్

చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), మార్చి, 25 (ఆంధ్రజ్యోతి) : గడిచిన ఆర్థిక సంవత్సరంలో సంగం డెయిరీ టర్నోవర్ రూ.2వేల కోట్ల మైలురాయిని అధిగమించిందని సంగం డెయిరీ చైర్మన్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తెలిపారు. వడ్లమూడి సంగం డెయిరీ ప్రాంగణంలో మంగళవారం పాలకవర్గ సమావేశం జరిగింది. పలు అంశాలపై చర్చించిన పాలకవర్గం వాటిని ఆమోదించింది. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం సంగం డెయిరీ రోజుకు 10.5లక్షల లీటర్ల పాల సేకరణ చేస్తున్నట్లు తెలిపారు. మరో 14 చిల్లింగ్ సెంటర్లను కొత్తగా ఏర్పాటు చేసి అదనంగా రోజుకు లక్షన్నర లీటర్ల పాలను సేకరించి వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.2,200కోట్ల టర్నోవర్ సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. వాల్యూయాడెడ్ ప్రొడక్ట్ బటర్, పన్నీరు వంటి ఉత్పత్తులతో పోటీ ప్రపంచంలో మరింత నాణ్యతగా అందించేందుకు రు.5కోట్ల మిషనరీ కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. కొత్తరకం నెయ్యి ఉత్పత్తులు మార్కెట్లోకి తీసుకురావడానికి కృషిచేస్తున్నట్లు తెలిపారు. సంగం డెయిరీలో ప్రస్తుతం 8లక్షల లీటర్ల ప్రాసెసింగ్ యూనిట్, మిర్యాలగూడలో లక్షన్నర లీటర్ల ప్రాసెసింగ్ యూనిట్‌లు సమర్థవంతంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈఏడాది రైతులకు 50కోట్ల బోనస్ పంపిణీ చేయాలని పాలకవర్గం ఆమోదించిందన్నారు. నెల్లూరు, తిరుపతి వంటి ప్రాంతాల్లో సంగం ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని భవిష్యత్‌లో చెన్నైలో కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. రైతులకు సరఫరా చేసే దాణాలు కూడా కొత్తరకం దాణాలను ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. పడ్డ దూడల ఉత్పత్తికి ప్రారంభించిన సెక్సెడ్ సెమెన్ ప్రాజెక్ట్ ద్వారా 2వేల పశువులకు సెమెన్ అందించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో 10వేల పశువులకు ఈ ప్రాజెక్ట్ ద్వారా సెమెన్ అందించి పడ్డ దూడల పెంపుకు ప్రాజెక్ట్ పనిచేస్తుందన్నారు. అధిక దిగుబడులు ఇచ్చే బీపీటీ మినుము విత్తనాలను మార్కెట్లో సంగం బ్రాండ్ పేరుతో తీసుకురానున్నట్లు తెలిపారు. పశువుల కోసం మేలైన గడ్డి జాతి విత్తనాలు అభివృద్ధి చేసి దేశంలోనే 15మిల్క్ యూనియన్లకు అందజేస్తున్నామన్నారు. త్వరలోనే అరబ్ దేశాలతో పాటు అమెరికాకు సంగం ఉత్పత్తులు ఎగుమతి చేయనున్నట్లు తెలిపారు. అలాగే రైతులకు అన్నిరకాల సేవలదించేందుకు మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు చైర్మన్ నరేంద్రకుమార్ వివరించారు. ఈ సమావేశంలో సంగం ఎండీ గోపాలకృష్ణన్, పాలకవర్గ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పాలకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్

ఆర్టీఈ అడ్మిషన్లకు అనుమతి

అమరావతి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): విద్యా హక్కు చట్టంలో భాగంగా రాష్ట్రంలో ప్రైవేటు విద్యా సంస్థల్లో ఒకటో తరగతిలో అడ్మిషన్లు చేపట్టేందుకు అనుమతిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. దీనిపై న్యాయ వివాదాలు ఏర్పడిన నేపథ్యంలో ఈ మేరకు స్పష్టతనిచ్చింది. 2025-26 విద్యా సంవత్సరానికి ప్రైవేటు విద్యా సంస్థలు 25శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించాలి. వారికి ఫీజులను ప్రభుత్వం చెల్లిస్తుంది.

రాష్ట్రంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ కూడా: సీఎం చంద్రబాబు

అమరావతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.మధుమూర్తి, ఓపెన్ యూనివర్సిటీ ఓఎస్డీ వెలగ జోషి సోమవారం రాత్రి సీఎంను కలవగా పైవిధంగా స్పందించారు. త్వరలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి యూనివర్సిటీల ఏర్పాటుపై సాను కూల నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ రెండు యూనివర్సిటీల ఉద్యోగుల జీతాల సమస్యను కూడా పరిష్కరిస్తామని చెప్పారు. వర్సిటీల్లో విద్యా ప్రమాణా లు మెరుగుపరచాలని, కొత్త కోర్సులు ప్రవేశపెట్టాలని సీఎం వారికి సూచించారు.

మద్యపాన దుష్పరిణామాలపై అవగాహనకు 'కేర్'

కార్యక్రమం అమలుకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కమిటీలు

అమరావతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మద్యపాన వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 'కమిటీ ఫర్ ఆల్కహాల్ అవేర్‌నెస్ అండ్ రెస్పాన్సివ్ ఎడ్యుకేషన్(కేర్) పేరుతో ఎక్సైజ్ శాఖ కొత్త కార్యక్రమాన్ని రూపొందించింది. దీనిపై మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. బహిరంగ సదస్సులు, ఫ్లాష్ మాబ్‌లు, ర్యాలీలు, కరపత్రాల పంపిణీ, సెమినార్లు, సెషన్ల రూపంలో ప్రజల్లో అవగాహన కల్పించడం దీని ఉద్దేశం. ఈ కార్యక్రమం అమ లుకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కమిటీలు నియమించింది. రాష్ట్ర స్థాయి కమిటీకి ఎక్సైజ్ శాఖ మంత్రి చైర్మన్‌గా ఉంటారు. ఎక్సైజ్ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్, అదనపు కమిషర్, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి, ఎన్‌జీవో నుంచి ఒకరు, మరో ఇద్దరు ప్రముఖ సామాజిక కార్యకర్తలు ఇందులో ఉంటారు. జిల్లా స్థాయి కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా ఉంటారు. ఎస్పీ, జిల్లా ఎక్సైజ్ అధికారి, విద్యా, ఆరోగ్య శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారు.

కొలనుకొండ మహిళ హత్యకేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

-వివరాలు వెల్లడించిన డీఎస్పీ మురళీకృష్ణ

తాడేపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కొలనుకొండ గ్రామ శివారులో మహిళను హత్య చేసి తప్పించుకుని తిరుగుతున్న ఇరువురు నిందితులను మంగళవారం తాడేపల్లి సీఐ కల్యాణరాజు అరెస్టు చేశారు. ఈ మేరకు తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నార్త్ జోన్ డీఎస్పీ మురళీకృష్ణ వివరాలు వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి తాడేపల్లి రాధారంగనగర్‌కు చెందిన ముత్యాల కోమలకుమార్ ఎలియాస్ చింటు, విజయవాడ రాణిగారి తోటకు చెందిన హిజ్రా బత్తుల శశి ఎలియాస్ జెస్సీ లను అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి... ఈ నెల 23వ తేదీ రాత్రి సమయంలో కొలనుకొండ హైవే సమీపంలో గుంటూరు ఛానల్ వద్ద నిర్మానుష్య ప్రాంతంలో ఓ మహిళ హత్యకు గురైందన్న విషయాన్ని తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పలు వివరాలు సేకరించారు. మృతురాలు పామర్రుకు చెందిన సజ్జా తిరుపతమ్మగా గుర్తించారు. ఆమె భర్త పదేళ్ల క్రితం చనిపోయాడని, ఇరువురు పిల్లలతో ఏడాది క్రితం విజయవాడ రాణిగారితోటకు వచ్చి నివాసం ఉంటూ కేటరింగ్ పనులు చేసుకుంటూ అదే ప్రాంతంలో ఉండే ట్రాన్స్‌జెండర్ బత్తుల శశి ఎలియాస్ జెస్సీతో పరిచయమైంది. ఈ క్రమంలో మృతురాలికి రాధారంగ నగర్‌కు చెందిన ముత్యాల కోమలకుమార్ ఎలియాస్ చింటు పరిచయమై వీరి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. కాగా రెండు నెలల నుండి రాజేష్ అనే అతనితో మృతురాలు సన్నిహితంగా వుంటుంది. ఈ క్రమంలో శశి భర్త నవీన్‌కు కూడా తిరుపతమ్మపై కోరిక ఉందన్న విషయం శశి గమనించింది. తన భర్త ఎక్కడ దూరమవుతాడోనని శశి, తనను వదిలి రాజేష్‌తో క్లోజ్‌గా ఉంటుందని తెలిసిన కోమలకుమార్ ఇరువురు తిరుపతమ్మను ఎలాగైనా హత్య చేయాలని పథకం పన్నారు. ఈ నెల 23న తిరుపతమ్మ వడ్డేశ్వరం గ్రామంలో తెలిసిన వారిని కలవడానికి రాగా, ఇప్పటం రోడ్డులో గుంటూరు ఛానల్ వద్ద వీరిరువురు కాపు కాసి తిరుపతమ్మను అడ్డగించారు. శశి మృతురాలిని గట్టిగా పట్టుకోగా కోమలకుమార్ కత్తితో మెడపై పొడవగా బలమైన రక్తగాయాలై ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. కాగా నేరం వేరే వారి పైకి వెళ్లేవిధంగా పక్కదారి పట్టించేందుకు ఒక జత చెప్పులు, షర్టు ఉన్న కవర్‌ను నేరస్థలంలో పెట్టి నిందితులు ఇరువురు పారిపోయారు. అనంతరం పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపట్టి నిందితులను అరెస్టు చేశారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ కల్యాణరాజు

అజ్ఞాతంలో ప్రముఖ మొబైల్ షాప్ నిర్వాహకుడు

నరసరావుపేట లీగల్, మార్చి 25, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లో గల ఆర్డీవో కార్యాలయ సెంటర్‌లోని మొబైల్ షాప్ నిర్వాహకుడు గత మూడు రోజులుగా అజ్ఞాతంలోకి వెళ్లాడు. ఫోను స్విచ్ ఆఫ్ చేశాడు. బంధువులు, పరిచయస్తులు, చుట్టుపక్కల వారి నుంచి సదరు షాప్ నిర్వాహకుడు సుమారు రూ. 8 కోట్ల మేరకు అప్పులు చేసినట్లు సమాచారం. దీనిపై కొందరు సోషల్ మీడియాలో సదరు వ్యక్తి ఐపీ పెట్టినట్టు ప్రచారం చేస్తున్నారు. ఇంతవరకు సదరు వ్యక్తి ఐపీ దాఖలు చేయలేదు. ఈ విషయమై మొదటి పట్టణ సీఐ ఎంవీ చరణ్‌ను వివరణ అడుగగా తమకు ఎటువంటి ఫిర్యాదులు అందలేదన్నారు.

అమరావతిలో పర్యటించిన జపాన్ ప్రతినిధుల బృందం

అమరావతి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో పెట్టుబ డులు పెట్టే విషయమై బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చర్చించేందుకు ఓనో కీచి ఆధ్వర్యంలో వచ్చిన ఏడుగురు సభ్యులు గల జపాన్ ప్రతినిధుల బృందం మంగళవారం సాయంత్రం బౌద్ధ ఆరామంగా పేరు గాంచిన అమరావతిని సందర్శించారు. స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆహ్వానం మేరకు ఈ బృందం ముందుగా ధ్యానబుద్ధ ప్రాజెక్టు, మహాచైత్యం, పురావస్తు సంగ్రహాలయాలను సందర్శించింది. అమరావతిలో బౌద్ధమతానికి 2400సంవత్సరాల చరిత్ర ఉందని ప్రపంచస్థాయిలో బౌద్ధులు ప్రతి సంవత్సరం సందర్శిస్తారని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, జపాన్ ప్రతినిధులకు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే ప్రవీణ్, జేసీ సూరజ్ గనోరే, ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి జపాన్ ప్రతినిధులను ధ్యానబుద్ధ జ్ఞాపికతో సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ డానియేలు, సీఐ అచ్చయ్య, టూరిజం అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



ధ్యానబుద్ధ ప్రాజెక్టు వద్ద జపాన్ ప్రతినిధులతో ఎమ్మెల్యే ప్రవీణ్, జేసీ సూరజ్ గనోరే తదితరులు

జీఎంసీకి డాక్టర్ నరేష్‌బాబు రూ.25 లక్షల విరాళం

● నూతన క్యాంటీన్ నిర్మాణం కోసం...



గుంటూరు మెడికల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వైద్య కళాశా లలో నూతనంగా చేపడుతున్న క్యాంటీన్ నిర్మాణానికి ప్రముఖ స్పైన్ సర్జన్, మల్లిక స్పైన్ సెంటర్ అధినేత డాక్టర్ జే నరేష్ బాబు రూ.25 లక్షల విరాళం ప్రకటించారు. జీఎంసీ 1991వ బ్యాచ్‌కు చెందిన డాక్టర్ నరేష్ బాబు వ్యక్తిగ తంగా ఈ విరాళం అందజేస్తున్నారు. ప్రస్తుతం కాలేజీ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌లో ఉన్న పాత క్యాంటీన్‌ను తొలగించి ఆ స్థానంలో ఎగ్జామినేషన్ హాల్‌ను నిర్మిస్తున్నారు. జింకానా ఆడిటోరియం సమీపంలో కొత్త క్యాంటీన్‌ను నిర్మిస్తారు. ఫ్యాకల్టీ, వైద్య విద్యార్థులు, సిబ్బందికి వేర్వేగా కేబిన్‌లను క్యాంటీన్‌లో ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్యాంటీన్ నిర్మాణానికి సుమారు రూ.40 లక్షల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. నరేష్‌బాబు రూ.25 లక్షలు అందజేయడంతో పాటు మిగిలిన మొత్తాన్ని నాటి తన బ్యాచ్ మేట్లను సంప్రదించి సమకూర్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. డాక్టర్ నరేష్‌బాబు మాతృమూర్తి ఆంకాలజిస్ట్ డాక్టర్ ఓలేటి శివలీల గతంలో జీఎంసీ ప్రిన్సిపాల్‌గా సేవలు అందించారు. ఆమె కూడా జీఎంసీ పూర్వ విద్యార్థే, నరేష్‌బాబు ఇరువురు సోదరులు కార్డియాలజిస్ట్ డాక్టర్ జే మహేష్ బాబు, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రంగనాథ్ కూడా గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థులే. రూ.25 లక్షల విరాళం ప్రకటించిన డాక్టర్ నరేష్‌బాబును జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారీ మంగళవారం అభినందించారు.

ముగ్గురు వీఆర్‌వోలకు షోకాజ్ నోటీసులు

మాచవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): భూముల ఆన్‌లైన్, పట్టాదారు పాసు పుస్తకాల కోసం రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు రావడంతో మండలంలోని ముగ్గురు వీఆర్‌వోలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మల్లవోలు, పిల్లుట్ల, తురకపాలెం గ్రామాలలో వీఆర్‌వోలుగా పనిచేస్తున్న వై ఏసుదానం, ఆర్ లోకేశ్, జానీ బాషాలకు గురజాల ఆర్డీవో మురళీకృష్ణ ఆదేశాల మేరకు తహసీల్దార్ నాగ మల్లేశ్వరరావు నోటీసులు జారీ చేశారు. ఒక వైపు మాచవరం మండలంలో భూమాయ పరిష్కారం కాక ముందే ముగ్గురు వీఆర్‌వోలకు నోటీసులు జారీ చేయటం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

బైకు అదుపుతప్పి యువకుడు మృతి

కారంపూడి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): బైకు అదుపుతప్పి లారీ కిందకు దూసుకెళ్లడంతో యువకుడు మృతిచెందిన సంఘటన కారంపూడి పట్టణ శివారులోని చింతపల్లి రోడ్డు వద్ద చోటుచేసుకుంది. మండలంలోని పేటసన్నిగండ్ల గ్రామానికి చెందిన వేముల సాగర్ (18) మంగళవారం ద్విచక్ర వాహనంపై అతివేగంగా వస్తూ ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి వేగాన్ని అదుపుచేయలేక బైకు అదుపుతప్పి లారీ కిందకు దూసుకెళ్లింది. ఈ సంఘటనలో తీవ్ర గాయాలపాలైన సాగర్‌ను కారంపూడిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. ఎస్ఐ వాసు సంఘటనా ప్రదేశానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు అవివాహితుడు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.



సాగర్ మృతదేహం

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 520.90 అడుగులు ఉంది. 150.92 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 6041 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7110 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో వాటర్‌గా 15,251 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 6779 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.05 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	116, 124, 135
చికెన్ విత్ స్కిన్(కిలో)	220.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	230.00

1,39,165 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 1,44,172 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,39,165 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 69,373 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	12600
నంబరు. 5	10000	13100
273	10000	12600
341	10000	14000
4884	10000	11400
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	13100

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
షార్క్-1	10000	12000
బ్యాడిగి 355	10000	13000
సింజెంటా		
బ్యాడిగి 5531	10000	12000
దేవనూరు డీలక్స్	10200	12500
ఆర్మూరు	10000	11200
తాలుకాయలు	5000	6500

మున్సిపల్ చైర్మన్‌గా బడేజాని


చైర్మన్ బడేజాని

గురజాలటౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గురజాల నగర పంచాయతీ మున్సిపల్ చైర్మన్‌గా షేక్ బడేజాని మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న పోలు పవన్మయి గతేడాది నవంబరు 30వ తేదీన అనారోగ్య కారణాలతో సెలవులోకి వెళ్లారు. ఈ నేపథ్యంలో వైస్ చైర్మన్ ఉన్న బడేజాని ఇన్‌చార్జి చైర్మన్‌గా ఇప్పటి వరకు బాధ్యతలు నిర్వహించారు. చైర్మన్‌గా పూర్తి బాధ్యతలు చేపట్టిన బడేజానికి మున్సిపల్ కమిషనర్ శివన్నారాయణ, కౌన్సిలర్లు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

నేడు ప్రజాదర్బార్ రద్దు

మాచర్లటౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించవలసిన ప్రజాదర్బార్ రద్దయింది. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి బుధవారం అసెంబ్లీలో కొన్ని అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనాల్సిరావడం వల్ల ప్రజాదర్బార్‌ను రద్దు చేశారు.

రేపు క్రెడిట్ క్యాంపు

రాజుపాలెం, క్రోసూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాజుపాలెం, క్రోసూరు మండలపరిషత్ కార్యాలయాల్లో ఈ నెల 27వ తేదీన క్రెడిట్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఎంపీడీవోలు జీవీ సత్యనారాయణ, జీ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం వారి కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ బీసీ, ఈబీసీ, కాపు, కమ్మ, రెడ్డి, వైశ్య, కుమ్మరిలలో అల్పాదాయం కల్గిన వారికి వివిధ పథకాల కింద సబ్సిడీ రుణాలు అందించుటకు ఈ నెల 27న మధ్యాహ్నం 2 గంటలకు క్రెడిట్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ క్యాంపునకు బ్యాంకు మేనేజర్లు, సెలక్షన్ కమిటీ సభ్యులు హాజరుకావాలని కోరారు. క్యాంపు నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో తెలియజేయాలన్నారు.

28న ఉపాధి హామీ ప్రజావేదిక

మాచవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఈ నెల 28వ తేదీన ఉపాధి హామీ ప్రజావేదిక నిర్వహిస్తామని ఎంపీడీవో వెంగళరావు మంగళవారం తెలిపారు. 2023 - 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సుమారు రూ.4 కోట్ల మేర పనులు జరిగాయని, ఈ పనులకు సంబంధించి ఇప్పటికే ఆయా గ్రామాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారని, తనిఖీలు అనంతరం ఆయా గ్రామాల్లో గ్రామసభలు కూడా నిర్వహిస్తున్నారని తెలిపారు. అన్ని గ్రామాల్లో గ్రామసభలు అయిపోయిన తరువాత 28న మండల స్థాయిలో ప్రజావేదిక నిర్వహిస్తారని ఎంపీడీవో తెలిపారు.

2న బల్లకట్టు వేలం పాటలు

మాచవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందాపురం బల్లకట్టు నిర్వహణకు సంబంధించి ఏప్రిల్ 2వ తేదీన జిల్లా పరిషత్‌లో బహిరంగ వేలం నిర్వహిస్తామని ఎంపీడీవో వెంగళరావు మంగళవారం తెలిపారు. 2025 - 26 సంవత్సరానికి సంబంధించి ఈ వేలం పాట నిర్వహిస్తామని, ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొనాలని తెలియజేశారు.

రూ.60వేలు ఆర్థిక సాయం

అచ్చంపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదపాలెంలో సంగం డెయిరీలో పాలు పోస్తున్న పాల ఉత్పత్తిదారులైన రామిశెట్టి అనంత రావమ్మ మృతి చెందిన నేపథ్యంలో సంగంలో వెల్ఫేర్ స్కీమ్ నందు సభ్యు రాలిగా ఉన్నందున రూ.60వేలు ఆర్థిక సాయం ఆమె కుటుంబానికి అందించి నట్టు సంఘ కార్యకర్త చిరుమామిళ్ళ నరసింహారావు మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో రెంటపాళ్ళ బీఎంసీ ఇన్‌చార్జ్ పీ గోపీ, సూపర్వైజర్ నరేష్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా స్వామివారి కల్యాణం

బెల్లంకొండ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండలో సోమవారం రాత్రి, మంగళవారం తెల్లవారుజాము వరకు గంగా పార్వతి సమేత నాగేశ్వర గౌతమి స్వామి వార్ల శాంతి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించినట్టు బెల్లంకొండ దేవదాయశాఖ ఈవో వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

కేసానుపల్లిలో ఇఫ్తార్

దాచేపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేసానుపల్లిలో మంగళవారం రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలకు ఇఫ్తార్‌ను ఏర్పాటు చేశారు. మంగళవారం టీడీపీ సీనియర్ నాయకులు నెల్లూరి రామకోటయ్య, కోట సాయన్న ఆధ్వర్యంలో ఇఫ్తార్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నెల్లూరి కోటయ్య, బొల్లా కృష్ణారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

స్థలం విషయమై గొడవ.. కేసు నమోదు

పెదకూరపాడు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): స్థలం విషయమై గొడవ జరిగి ఓ వ్యక్తిని కొట్టిన ఘటన మండలంలోని అబ్బరాజుపాలెంలో జరిగినట్టు ఎస్‌ఐ జీ గిరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామానికి చెందిన రాయపాటి రామారావు ఇంటిస్థలం విషయంలో సరిపూడి వెంకట్రావమ్మ, మరో ఇద్దరు ఈ నెల 23వ తేదీ గొడవ జరిగిందని, గడ్డపలుగు తీసుకొని తలమీద కొట్టారని, చంపుతామని బెదిరించారని, ఈ విషయంపై ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

అభివృద్ధి పనుల నాణ్యత పరిశీలన

సత్తెనపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ పేరుతో మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనుల నాణ్యతను మంగళవారం పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ టీం సభ్యులు పరిశీలించారు. మండలంలోని అబ్బూరు, భీమవరం, కట్టమూరు, గుడిపూడి గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్ల నాణ్యత ప్రమాణాలను టీమ్ పరిశీలించింది.

వెల్దుర్తి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించారు. మండాది, ఉప్పలపాడు, గుండ్లపాడు, బోదలవీడు, శ్రీరాంపురం తండా, రచ్చమలపాడు తదితర గ్రామాల్లో సుమారు రూ.93 లక్షల విలువైన రోడ్ల నాణ్యతను పరిశీలించారు.

ఆశాజనకంగా ప్రత్యామ్నాయ పంటలు

- పొగాకు, మొక్కజొన్న సాగుపై రైతుల మక్కువ
- తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు


వేమవరంలో ఏపుగా పెరిగిన పొగాకు పంట


ఆరుదల కోసం వేసిన పొగాకు పందిళ్ళు

మాచవరం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పల్నాడు ప్రాంతంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. లక్షలకు లక్షలు పెట్టుబడులు పెట్టి పత్తి, మిర్చి పంటలు పండించినప్పటికీ లాభాలు లేక అప్పులు మిగలడంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై మొగ్గు చూపుతున్నారు. పత్తి, మిర్చి పంటలు సాగు చేయాలంటే పెట్టుబడులు ఎక్కువవుతున్నాయి. అందువల్ల రైతుల చూపు పత్యామ్నాయ పంటల వైపు మళ్లింది. పొగాకు, మొక్కజొన్న పంటలకు వ్యాపారులు ముందుగానే విత్తనాలు, పురుగుమందులు ఇవ్వడమే కాకుండా ఎకరానికి రూ.20వేలు పెట్టుబడి సాయం అందజేస్తున్నారు. మాచవరం మండలంలోని పలు గ్రామాల్లో పొగాకు, మొక్కజొన్న పంటలను సుమారు


మాచవరంలో దట్టంగా పెరిగిన మొక్క జొన్న

వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. మొక్కజొన్న పంట సాగుచేసే రైతులకు ఎకరానికి పది కేజీలు విత్తనాలతో పాటు ఐదు విడతలుగా కావాల్సిన పురుగుమందులు ఇస్తున్నారు. ఎకరానికి సుమారు 30 నుంచి 40 క్వింటాళ్ల మొక్కజొన్నలు దిగుబడి వస్తాయని, క్వింటాల్ రూ.3500 చొప్పున రైతుల వద్ద కొనుగోలు చేసి వారు ముందుగానే ఇచ్చిన రూ.20వేలు పోను మిగిలిన నగదును రైతులకు అందజేస్తున్నారు. ఎకరానికి సుమారు పది క్వింటాళ్ళ పొగాకు దిగుబడి వస్తుందని, క్వింటాల్ రూ.15వేల ధర పలుకుతుందని, ఎకరానికి పెట్టుబడులు పోను రూ.40వేల నుంచి రూ.50వేల వరకు మిగులుతుందని రైతులు తెలిపారు. పత్తి, మిర్చి పంటలతో పోల్చుకుంటే పొగాకు, మొక్కజొన్న పంటలు ఆశాజనకంగా ఉన్నాయని పలు గ్రామాల రైతులు చెబుతున్నారు. మొక్కజొన్న పంటను వ్యాపారులు గ్రామాలకే వచ్చి కొనుగోలు చేస్తారని, పొగాకు పంటను వినుకొండ, సత్తెనపల్లి, మేదరమెట్ల, ఒంగోలు తదితర పట్టణాలకు వెళ్లి అమ్ముకుంటామని రైతులు పేర్కొంటున్నారు.

ఆరెకరాలు పొగాకు సాగు చేశాను

- జక్కుల కాశయ్య, రైతు, వేమవరం



ఆరు ఎకరాల్లో పొగాకు పంట చేశా. ఎకరానికి రూ.లక్ష వరకు పెట్టుబడి అవుతుందని, ఎకరానికి సుమారు రూ.40వేలు నుంచి రూ.50వేలు వరకు నికర మిగులు ఉంటుంది.

200 ఎకరాలకు విత్తనాలు, పెట్టుబడులు అందజేశాం

- పూసల సత్యనారాయణ, రైతు



మండలంలోని పలు గ్రామాల్లో 200 ఎకరాల విస్తీర్ణంలో మొక్కజొన్న సాగుకు విత్తనాలు, పురుగు మందులు కంపెనీల ద్వారా మధ్యవర్తిగా సరఫరా చేశాం. విత్తనాలు, పురుగుమందులు ఉచితంగా అందజేస్తాం. పెట్టుబడి సాయం కింద మరో రూ.20 వేలు ఇస్తున్నాం.

టీడీపీ కార్యకర్తలకు అండగా బీమా సౌకర్యం

- ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్


రుద్రవరంలో పార్టీ కార్యకర్తలకు టీడీపీ సభ్యత్వ కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అచ్చంపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు బీమా సౌకర్యం అండగా ఉంటుందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. రుద్రవరంలో మంగళవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ టీడీపీ నాయకులు, కార్యకర్తలకు సభ్యత్వ కార్డులను అందించారు. పలు సమస్యలను కార్యకర్తలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, మాజీ సర్పంచ్ బిక్కి సీతయ్య, గ్రామసర్పంచ్ ఘంటా ఉషారాణి, కోనూరు మాజీ సర్పంచ్ తాళ్ళూరి లక్ష్మీనారాయణ, చల్లా రమేష్, పూల కోటేశ్వరరావు, తిరువాయిపాటి ఆంజనేయులు, ఎస్‌కే కాసుల తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

రుద్రవరంలో మంగళవారం శ్రీవెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో బ్రహ్మోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వెంకటేశ్వర స్వామి అనుగ్రహంతో రానున్న రోజుల్లో నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందేలా పనిచేస్తానని తెలిపారు. సందర్భంగా ఆలయ ధర్మకర్తలు ఘంటా నాగేశ్వరరావు, గ్రామ సర్పంచ్ ఉషారాణి ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు.

మాచాయపాలెం గ్రామాన్ని అభివృద్ధి పరుస్తా..

బెల్లంకొండ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచాయపాలెం గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మాచాయపాలెంనకు చెందిన టీడీపీ మండల నాయకుడు, మాజీ ఎంపీటీసీ గుడిసె కొండయ్య ఆధ్వర్యంలో కొంత మంది టీడీపీ నాయకులు గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో భాష్యం ప్రవీణ్‌ను కలిశారు. గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో టీడీపీ నాయకులు చెన్నయ్య, బంగారయ్య, పూర్ణయ్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 30.05 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈఈ రాజు తెలిపారు. లీకుల ద్వారా మూడు వందల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

సొసైటీలో లావాదేవీలన్నీ డిజిటలైజేషన్

క్రోసూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): క్రోసూరు సహకార సంఘంలో లావాదేవీలన్నీ డిజిటలైజేషన్ జరుగుతుందని సబ్ డివిజనల్ సహకారశాఖ అధికారి టీ రజిని అన్నారు. క్రోసూరు సొసైటీ పర్సనల్ ఇన్‌చార్జ్‌గా నియమితులైన ఆమె మంగళవారం జరిగిన మహాజన సభలో పాల్గొన్నారు. సొసైటీసభ్యుల లావాదేవీలన్నీ పారదర్శకంగా ఉంటాయన్నారు. రైతులందరూ తాము పొందిన రుణాలను సకాలంలో చెల్లిస్తూ సంఘ పురోభివృద్ధికి తోడ్పడాలన్నారు. సొసైటీ ద్వారా జరిగే ఎరువుల పంపిణీ గానీ, ఇతర కార్యకలాపాలు గానీ ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పూర్తిగా కంప్యూటీకరణ చేస్తామని ఆమె తెలిపారు. సీఈవో నాగేశ్వరరావు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఏపూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

సత్తెనపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో న్యాయవాది ఇజ్రాయేలు దారుణ హత్యను ఖండిస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం విధులను బహిష్కరించి న్యాయదేవత విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. మహిళకు న్యాయసేవలు అందిస్తున్న న్యాయవాదిని దారుణంగా హత్య చేయటాన్ని ఖండిస్తున్నామన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో గుజ్జర్లపూడి మార్కురావు, చిట్టా విజయ భాస్కర్ రెడ్డి, దివ్వెల శ్రీనివాసరావు, జొన్నలగడ్డ విజయకుమార్, బీఎల్ చిన్నయ్య, చిన్నం మణిబాబు, చావా బాబూరావు, జూపల్లి శేషయ్య, ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వం ఉన్న కార్యకర్తలను పార్టీ ఆదుకుంటుంది

- ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

ముప్పాళ్ళ మార్చి 25(ఆంధ్రజ్యోతి): సభ్యత్వం ఉన్న కార్యకర్తలను ఆపదకాలంలో పార్టీ ఆదుకుంటుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. ముప్పాళ్ళ టీడీపీ కార్యాలయంలో మంగళవారం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు సభ్యత్వ కార్డులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ కార్యకర్తలు నాయకులు ఐక్యంగా ఉండి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. దీంతో ముప్పాళ్ళ టీడీపీ నాయకులు గ్రామంలో టీడీపీ కాని వారి పెత్తనం సాగుతుందని ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లినా పరమేశ్వరరావు పేరు చెబుతున్నారని పార్టీగెలుపునకు తాము కష్టపడితే మాపై అతను పెత్తనం చేస్తున్నాడని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. గత టీడీపీ ప్రభుత్వంలో గ్రామంలో కోట్ల రూపాయల పనులు చేశామని అటువంటిది గ్రామంలో కార్యకర్తల ప్రమేయం లేకుండా, ఎవరికీ తెలియకుండా పను


కార్యకర్తలకు సభ్యత్వ కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా

లు జరుగుతున్నాయని ఎమ్మెల్యేకి తెలియజేశారు. గ్రామంలో వివాదం లేకుండా చూడాలని నాయకులకు కన్నా లక్ష్మీనారాయణ సూచించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు బత్తుల నాగేశ్వరరావు, నాయకులు గోగినేని కోటేశ్వరరావు, శిరిగిరి గోపాలరావు, ఎంపీటీసీ కళ్ళం విజయభాస్కరరెడ్డి పలువురు టీడీపీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

సంపూర్ణ సారా రహిత గ్రామాలే లక్ష్యంగా నవోదయం 2.0

- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు

వెల్దుర్తి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ సారా రహిత గ్రామాలే లక్ష్యంగా నవోదయం 2.0 కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటి కమిషనర్ కే శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కొత్తపుల్లారెడ్డిగూడెం, మరసపెంట గ్రామాల్లో నిర్వహించిన నవోదయం 2.0 గ్రామ సభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. రానున్న మే నెల నాటికి ప్రతి గ్రామం సంపూర్ణ సారా రహిత గ్రామంగా ఉండాలని, ఇందుకు అధికారులు, గ్రామస్థులు సంపూర్ణ సహకారం అందించాలన్నారు. సారా అమ్మినా, తయారు చేసినా ప్రభుత్వ ప్రోత్సాహకాలు నిలిపివేస్తామన్నారు. సారా వల్ల అనారోగ్యానికి గురై కుటుంబాలు అనాథలుగా మిగులుతాయన్నారు. సారాను వృత్తిగా ఉన్న వారు తమ తీరును మార్చుకొని వేరే జీవనోపాధిని ఎంచుకోవాలన్నారు. సారా తయారు చేస్తూ పట్టుబడితే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. అనంతరం అధికారులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ రవి కుమార్ డీపీఈవో మణికంఠ, మాచర్ల ఎక్సైజ్ సీఐ వెంకటరమణ, ఎస్‌ఐ సమందర్‌వలి, ఎంపీడీవో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతపై ప్రజలకు చైతన్యం కల్పించాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో, ఇతర సిబ్బంది

క్రోసూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతపై అధికారులు, ప్రజా ప్రతినిధులు బాధ్యత తీసుకొని ప్రజలను చైతన్యవంతులను చేయాలని ఎంపీడీవో జీ శ్రీనివాసరావు అన్నారు. ఘన వ్యర్థాల వినియోగంపై మంగళవారం జరిగిన రెండో రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రీన్ అంబాసిడర్లకు, గార్డులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల భవిష్యత్తులో జరిగే అనర్థాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. ఏడు గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు, ఇతర సిబ్బంది కార్యక్రమానికి హాజరయ్యారు. ఎన్‌ఈజీఎస్ ఏపీవో వెంకటేశ్వరరావు, మండలపరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరి ఆలయ అధ్యక్షుడిగా హనుమంతరావు


హనుమంతరావును అభినందిస్తున్న ఆర్యవైశ్య సంఘ నేత

కారంపూడి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థాన నూతన అధ్యక్షుడిగా మద్దు హనుమంతురావు ఎన్నికయ్యారు. మంగళవారం ఆలయంలో నిర్వహించిన ఆర్యవైశ్య సంఘ సమావేశంలో ఈ ఎన్నిక నిర్వహించారు. అలాగే నగరేశ్వరస్వామి దేవస్థాన ధర్మకర్తగా యక్కల శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ జిల్లా కార్యదర్శి వెచ్చా వరలక్ష్మణరావు, మండల అధ్యక్షుడు ఎస్‌పీఆర్ కృష్ణ, చీతిరాల వెంకట కోటేశ్వరరావు, యువజన సంఘ అధ్యక్షుడు సముద్రాల సాయి, మాజీ అధ్యక్షుడు రామకృష్ణ, కొత్త బ్రహ్మేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు కజ్జం పెద ఆంజనేయులు, మిత్తింటి సాంబశివరావు, మాజీ ఉప సర్పంచ్ సూరె అంకారావు తదితరులు నూతన అధ్యక్షులను అభినందించారు.

చేజర్ల కపోతేశ్వరాలయానికి జపాన్ బృందం


కపోతేశ్వర స్వామిని దర్శించుకుంటున్న జపాన్ బృందం

నకరికల్లు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): భారత దేశంలోనే రెండో అతి పురాతనమైన శైవక్షేత్రం చేజర్ల కపోతేశ్వరాలయమని జపాన్ దేశీయులు పేర్కొన్నారు. మంగళవారం నకరికల్లు మండలం చేజర్ల కపోతేశ్వరాలయానికి జపాన్ దేశానికి చెందిన పది మంది యాత్రికులు వచ్చారు. ఈ సందర్భంగా కపోతేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జపనీయులతో పాటు తెలంగాణా హైకోర్టు సీనియర్ సివిల్ జడ్జి జస్టిస్ చంద్రశేఖర్ కపోతేశ్వర స్వామిని దర్శించుకున్నారు. జపనీయులకు, జస్టిస్ చంద్రశేఖర్‌కు ఆలయ అర్చకులు కొండకావూరి వెంకట్రామయ్య శర్మ, భువనగిరి కపోతేశ్వర శాస్త్రి, ఆలయ ఉద్యోగులు చుండు గోవర్ధనరావు, సానా ఏడుకొండలు, వీఆర్‌వో రమణారెడ్డిలు సాదర స్వాగతం పలికారు.

ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణ


శిక్షణకు హాజరైన సిబ్బందికి సూచనలు చేస్తున్న కాంతారావు

గురజాలటౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలో సోమవారం నుంచి గురువారం వరకు ఐదు రోజులపాటు ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం జరుగుతున్న నేపథ్యంలో మండలంలోని మాడుగుల గ్రామంలోని ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని ఉన్నతాధికారులు నియోజకవర్గస్థాయి శిక్షణ కేంద్రంగా ఎంపిక చేశారు. మంగళవారం మాచవరం మండలపరిధిలోని అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నాగార్జున సాగర్ కుడికాలువ చైర్మన్ పులుకూరి కాంతారావు పాల్గొని ఘనవ్యర్థాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. పర్యావరణ సమస్యల పరిష్కారానికి ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు యాగంటి రామారావు, చావా రామారావు, మాడుగుల ఇన్‌చార్జి సర్పంచ్ మోషే, ఈవోపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ శ్రీకృష్ణదేవరాయలును విమర్శించేస్థాయి రజినీకి లేదు

- మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు

మాచర్లటౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రజాసమస్యల పరిష్కారానికి పాటుపడుతున్న నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలును విమర్శించేస్థాయి మాజీ మంత్రి రజినీకి లేదని మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నేత యాగంటి మల్లికార్జునరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంతో మంది పేద విద్యార్థులు ఇంజనీరింగ్ విద్య ద్వారా ఉన్నతమైన విద్యనందించడమే కాకుండా దేశ, విదేశాల్లో ఉద్యోగ కల్పన అందించడంలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ముందు వరుసలో ఉన్నారన్నారు. రజినీ అన్యాయాలు, దౌర్జన్యాలు, రౌడీయిజాలు, అక్రమలు మైనింగ్‌లు వంటి వాటికి తెరతీశారని ఆరోపించారు. రజిని చేసిన తప్పుల వల్లనే వాళ్ల నాయకుడు ఆమెను చిలకలూరిపేట నుంచి బయటకు పంపారన్నారు. రాజకీయ అనుభవం లేని గల్లా మాధవి చేతిలో ఘోరంగా ఓడిపోయిన నువ్వు ఇంకా మారలేదా అంటూ ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో బొట్టు కోటేశ్వరరావు, తిక్కా కొండలు, బ్రహ్మం, ఆంజనేయులు, గోలి వెంకటేశ్వర్లు, సదా, వీరు, కృష్ణ, మస్తాన్, శివ తదితరలు పాల్గొన్నారు.

నాయిబ్రాహ్మణుల సంక్షేమం కూటమి లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న మద్దిరాల గంగాధర్

అమరావతి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాయీ బ్రాహ్మణుల సంక్షేమమే లక్ష్యంగా కుటమి ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తుందని నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం గంగాధర్ అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అమరావతి నాయీబ్రాహ్మణ ఆత్మీయ సమావేశానికి గంగాధర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కూటమి ఎన్నికల హామీలో బాగంగా నాయీ బ్రాహ్మణులు నిర్వహించే సెలూన్ షాప్‌కు ఉచితంగా 200యూనిట్‌ల విద్యుత్ సరఫరా చేస్తుందని, ఆదరణ పథకం క్రింద వృత్తుల వారీగా పనిముట్లు అందించేందుకు రూ.100కోట్లు మంజూరు చేసిందని అన్నారు. ప్రతి ఆలయంలో పాలకమండలిలో నాయీబ్రాహ్మణులకు స్థానం కల్పిస్తుందని అన్నారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు నాగమల్లేశ్వరరావు, కోటేశ్వరరావు, శివప్రసాద్, వెంకటేశ్వర్లు తదితులు పాల్గొన్నారు.

డిజిటల్ బ్యాంకింగ్ పై రైతులకు అవగాహన


సహకార సంఘ సభ్యులతో మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్ సుధీర్‌కుమార్

అమరావతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ సహకార దినోత్సవం పురస్కరించుకుని మండలపరిధిలోని నరుకుళ్లపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ కార్యాలయంలో సహకార సంఘాల సభ్యులైన రైతులకు డిజిటల్ బ్యాంకింగ్‌పై అవగాహనా కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పరపతి సంఘాల సభ్యులను కంప్యూటరీకరణ చేయడం, డిజిటల్ లావాదేవీలు నిర్వహించడం ద్వారా సంఘాల నిర్వహణ సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించవచ్చునని డీసీసీ బ్యాంక్ మేనేజరు సుధీర్‌కుమార్ తెలియజేశారు. కంప్యూటరీకరణ ద్వారా లెక్కల నిర్వాహణ, డేటా భద్రత, ఆన్‌లైన్ లావాదేవీలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పర్సన్ ఇన్‌చార్జీ మోజెస్, మేనేజరు సుధీర్‌కుమార్, సంఘ సీవో వెంకటేశ్వరరావు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రోడ్ల తొలగింపును అడ్డుకున్న అధికారులు


తక్కెళ్ళపాడు వద్ద సిమెంట్ రోడ్డు తవ్వకాన్ని అడ్డుకుంటున్న రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు

దాచేపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిధులతో నిర్మించిన రహదారులను సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఎటువంటి అనుమతులు లేకుండా తొలగించే పనులు చేపట్టడంతో రెవెన్యూ, పంచాయతీ అధికారులు రోడ్డు తొలగింపు పనులను అడ్డుకున్నారు. మంగళవారం మండలంలోని తక్కెళ్ళపాడు, పెదగార్లపాడు మధ్యన ఉన్న వాగు కల్వర్టు వద్ద ప్రభుత్వ నిధులతో గతంలో కల్వర్టును నిర్మించింది. ఇది స్వల్పంగా దెబ్బతినడంతో చెట్టినాడు సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఎటువంటి అనుమతులు లేకుండా కొత్త రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టడంపై సమాచారం అందుకున్న పంచాయతీ అధికారులు కొప్పుల రవి, వీఆర్‌వో గిరి ఇతర సిబ్బంది కలసి రహదారి తొలగింపు పనులపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పనులు నిలిపివేయాలని కోరారు. ఫ్యాక్టరీ యాజమాన్యం ఇష్టానుసారం వ్యవహరించటంపై స్థానికుల నుంచి విమర్శలు వస్తున్నాయి.

కేసానుపల్లి హైస్కూల్‌కు స్థలం కేటాయించాలని వినతి

దాచేపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేసానుపల్లి గ్రామంలో హైస్కూల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని టీడీపీ సీనియర్ నేత నెల్లూరి రామకోటయ్య తహసీల్దార్ వైవీ కుటుంబరావును కోరారు. మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ అయింది. పాఠశాలలో మూడు వందల మంది వరకు విద్యార్థులు ఉన్నారు. విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగటంతో నూతన పాఠశాలకు స్థలం కేటాయించాలని కోరారు. సర్వే నెంబరు 793/3లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోసం స్థలాన్ని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో కోట సాయన్న, గడిపూడి సాంబశివరావు తదితరులు ఉన్నారు.

విద్యార్థినులు ఆత్మన్యూనత భావాన్ని విడనాడాలి

క్రోసూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు ఆత్మన్యూనత భావాన్ని విడనాడి లక్ష్యాల వైపు దూసుకుపోవాలని సైకాలజిస్టు యూసఫ్ అన్నారు. క్రోసూరులోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో మంగళవారం విద్యార్థినులకు కెరియర్ గైడెన్స్, మానసిక వైద్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినులందరూ తాము ఎవ్వరికీ ఏ విషయంలోను తీసిపోమన్న ఆత్మస్థైర్యాన్ని కలిగి ఉండాలన్నారు. క్రమశిక్షణతో మెలుగుతూ భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించేలా ధైర్యాన్ని కలిగి ఉండాలని, ఎటువంటి సమస్యలు వచ్చినా ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇందిరా ప్రియదర్శిని, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు.. శాశ్వత కార్డు

- యూనిఫైడ్ ఐడీ పేరుతో గుర్తింపు కార్డు అందించేలా కేంద్రం శ్రీకారం
- ఉమ్మడి జిల్లాలో ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ
- మీ సేవ, ఇంటర్నెట్ సెంటర్‌లలో దరఖాస్తు చేసుకునే అవకాశం
- కార్డులు నేరుగా ఇంటికే పంపుతున్న ప్రభుత్వం
- యూడీఐడీ పోర్టల్‌తో సదరం సేవలు కూడా సులభతరం



దివ్యాంగులకు జారీ చేస్తున్న యూనిక్ ఐడీ కార్డులు

గుంటూరు(తూర్పు), మార్చి 25(ఆంధ్ర జ్యోతి): శారీరక, మానసిక, అంధులకు కేంద్రం శుభవార్త చెప్పింది. శాశ్వత గుర్తింపు కార్డు జారీకి కేంద్రం శ్రీకారం చుట్టింది. గతంలో దివ్యాంగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంద జేసే సంక్షేమ పథకాలకు సదరం సర్టిఫికెట్ తప్పనిసరి. దీనికోసం సచివాలయాల్లో సదరం స్లాట్ బుక్ చేసుకున్న వారికి ప్రభుత్వం నిర్దేశించిన వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించి వైకల్య శాతాన్ని నిర్ధయించి వైద్యులు సర్టిఫికెట్లు జారీ చేసేవారు. ఈ సర్టిఫికెట్‌తో బస్సు, రైల్వే పాస్‌లకు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకునేవారు. అంతేగాక ఉద్యోగాల ఇంటర్వ్యూల సమయంలో సర్టిఫికెట్‌తో పాటు ఆధార్, ఇతర గుర్తింపు కార్డులు తీసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటువంటి సమస్యలకు చెక్ పెడుతూ వీటి స్థానంలో మొత్తంగా కేంద్రం యూడీఐడీ(యూనిఫైడ్ డిజేబిలిటీ ఐడెంటిటీ కార్డు) ఒకే కార్డు తీసుకొచ్చింది. దీనికి సంబంధించిన ప్రక్రియ జిల్లాలో మొదలైంది.

దరఖాస్తు.. ఇలా చేసుకోవాలి

మీ సేవ, ఇంటర్‌నెట్, మొబైల్ ఆన్‌లైన్‌లో స్వావలంబన్‌కార్డు. జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను ఓపెన్ చేసి, అందులో అప్లయ్ బటన్‌పై క్లిక్ చేయాలి. వెంటనే దరఖాస్తుకు సంబంధించిన సూచనలు ఉంటాయి. సూచనలను అంగీకరిస్తూ సబ్‌మిట్ క్లిక్ చేస్తే ఫారం ఓపెన్ అవుతుంది. ఫామ్‌లో ఉన్న అంశాలను క్షుణ్ణంగా చదివి సమాచారాన్ని నింపడంతో దరఖాస్తు ప్రక్రియ పూర్తి అవుతుంది. కావాలంటే దరఖాస్తు స్టేటస్‌ను నిత్యం పరిశీలించుకునే వెసులుబాటును కల్పిస్తుంది.

యూనిక్ ఐడీతోనే గుర్తింపు

భవిష్యత్తులో యూనిక్ ఐడీని తప్పనిసరి చేయాలని కేంద్రం భావిస్తున్నది. మిగిలిన రాష్ట్రాల్లో కూడా ఈ గుర్తింపుకార్డుతో ప్రయాణాల్లో రాయితీలు పొందవచ్చు. అంతేగాక రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలను ఈ కార్డు ద్వారా అందుకోవచ్చు. ఈ కార్డులో ఆధార్, వైకల్య శాతం, ఇతర వివరాలను పొందుపరు స్తున్నారు. ఈ ఐడీని స్కాన్ చేస్తే పూర్తి వివరాలను తెలుసుకోవచ్చు. ఇప్పటివరకు సదరం సర్టిఫికెట్లు మన రాష్ట్రంలో మాత్రమే చెల్లుబాటు అవుతాయి. ఐడీ కార్డులు మాత్రం దేశ వ్యాప్తంగా చెల్లుబాటు అవుతుంది.

2014లోనే ఈ ఆలోచనకు శ్రీకారం

వాస్తవానికి 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ ఆలోచనకు శ్రీకారం చుట్టింది. సదరం సర్టిఫికెట్ స్థానంలో ప్రత్యేక కార్డులను ప్రవేశపెట్టింది. ఈ కార్డులను జిల్లా విభిన్న ప్రతిభావంతుల కార్యాలయానికి పంపారు. అవి డీఆర్‌డీఏ శాఖకు అప్పజెప్పగా, వాటి బాధ్యత మెప్మాకు అప్పజెప్పారు. మెప్మా అధికారులు కొంతమందికి పంపిణీ చేసి, మిగిలిన వారికి ఇవ్వలేదు. కాకపోతే ఈ కార్డులో వైకల్యంశాతం మినహా మిగిలిన వివరాలను పొందుపరచకపోవడంతో ఈ కార్డులపై లబ్ధిదారులు ఆసక్తి చూపించలేదు. ప్రస్తుతం ఈ విధానాన్ని అప్‌డేట్ చేసి స్మార్ట్‌కార్డులను కేంద్రం తీసుకువచ్చింది.

సులభం...సదరం

కేంద్రం తీసుకొచ్చిన యూడీఐడీ పోర్టల్‌తో సదరం సేవలను కూడా అందజేస్తుంది. నూతనం విధానంతో సదరం సులభతరం చేసింది. ఈ పోర్టల్ ద్వారా సదరం శిబిరాలు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న వారికి సదరం శిబిరాలకు సంబంధించిన వివరాలు వారి ఫోనుకు సమాచారం వస్తుంది. వైద్య పరీక్షలకు ఎక్కడికి రావాలి... ఎప్పుడు రావాలి అనే విషయాలను ఎస్ఎంఎస్ ద్వారా పంపుతారు. గతంలో ఆన్‌లైన్ ద్వారా 5రకాల వైకల్యాలకు సంబంధించిన వ్యాధులకు సదరంలో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేది. ప్రస్తుతం యూడీఐడీ పోర్టల్‌లో 18రకాల వైకల్యాలను చేర్చారు. వాటిలో న్యూరో సంబంధిత బాధితులు, తలసీమియా, ఆటిజం, యాసిడ్ బాధితులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వ్యాధి నిర్ధారణ పూర్తయిన తరువాత కార్డుల రూపంలో నెల రోజులలోపు నేరుగా తపాలా కార్యాలయం ద్వారా ఇంటికే పంపుతున్నారు. చిరునామా సరిగ్గా లేకపోవడం, లబ్ధిదారుడు అందుబాటులో లేకపోతే ఈ కార్డులు కొన్ని చోట్ల స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు లేదా తపాలా కార్యాలయాల వద్ద ఉంచుతున్నారు. ఐడీ నెంబర్ చెబితే కార్డును తీసుకోవచ్చు.

కేంద్రం ఆలోచన అభినందనీయం



దివ్యాంగులు పడుతున్న కష్టాన్ని చూసి గుర్తింపు కార్డు ఇవ్వాలనే కేంద్రం ఆలోచన అభినందనీయం. గతంలో ఆయా కార్యాలయాల చుట్టూ తిరగాలంటే ఇబ్బంది పడేవాళ్లం. కేంద్రం ఆలోచనతో ఉమ్మడి జిల్లాలో ఉన్న లక్షా ఇరవై వేల మందికి లబ్ధి చేకూరుతుంది. ఇతర రాష్ట్రాల్లో కూడా చెల్లుబాటు అయ్యేలా కార్డు రూపొందించడం సంతోషంగా ఉంది. దరఖాస్తు చేసుకుని కార్డులు అందని వారు నేరుగా పోస్టల్ కార్యాలయాల్లో సంప్రదించాలి.

వై నరసింహారావు, విజువల్లీ ఛాలెంజ్‌డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్, జిల్లా అధ్యక్షుడు

శాశ్వత ఐడీ తప్పనిసరి



భవిష్యత్తులో యూనిక్ ఐడీ తప్పనిసరి. జిల్లాలో ఉన్న దివ్యాం గులు విధిగా దరఖాస్తు చేసుకో వాలి. కేంద్రం తీసుకువచ్చిన యూడీఐడీ పోర్టల్ ద్వారా సదరం సేవలను పొందవచ్చు.

సువార్త, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల జిల్లా శాఖ, ఏడీ

నాటి హామీ నేడు అమలు

(5వ పేజీ తరువాయి)

ముస్సిపాల్టీలో అభివృద్ధిని గాలికొదిలేసిందని జీవీ ఆంజనేయులు ఆరోపించారు. నాడు టీడీపీ ప్రభుత్వం రూ.161 కోట్లతో తాగునీటి పథకం పనులు చేపట్టగా వైసీపీ వాటిని నిలివేసిందని విమర్శించారు. తాజాగా ఆ పతకాన్ని తాము అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ పథకం పూర్తితో పట్టణంలో తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందన్నారు. ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేస్తామన్నారు. 102.60 లక్షలతో పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం ద్వారా ప్రజలు వారి సమస్యలు తన దృష్టికి తీసుకురాగా వాటిఇని పరిష్కారిస్తున్నామన్నారు. ఆంధ్రజ్యోతి వేదికగా ప్రజలు కోరిన పనులు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ నిధులు రూ.3 కోట్లను విడుదల చేసిందని వాటితో అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంతో ప్రజలకు ప్రజాప్రతినిధులు.. అధికారుల మధ్య అవినాభావ సంబంధం పెరుగుతుందన్నారు. సమస్యల్ని అధికారులు.. ప్రజా ప్రతినిధులు స్పష్టంగా అర్థం చేసుకోవడానికి.. వాటి పరిష్కారానికి అవకాశం కలుగుతుందన్నారు. ఇటువంటి వినూత్న కార్యక్రమం చేపట్టిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతి చైర్మన్ వేమూరి రాధాకృష్ణకు ప్రత్యేక అభినందలు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలకు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మున్సిపల్ చైర్మన్ షేక్ దస్తగిరి, కమిషనర్ సుభాష్‌చంద్రబోస్, కౌన్సిలర్లు వాసిరెడ్డి లింగమూర్తి, నన్నేసా, టీడీపీ పట్టణ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి యార్లగడ్డ లెనిన్‌కుమార్, నాగ శ్రీను, నిశ్శంకర శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ వాసిరెడ్డి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ ఎన్నికలపై జడ్పీ సీఈవో సమీక్ష


సమావేశంలో పాల్గొన్న జడ్పీ సీఈవో జ్యోతి బసు

గుంటూరు సిటీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని తొమ్మిది మండల పరిషత్‌ల్లో ఈ నెల 27న జరగనున్న ప్రత్యేక ఎన్నికల కార్యక్రమంపై జడ్పీ సీఈవో వీ జ్యోతి బసు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీ, కో-ఆప్షన్ మెంబర్ల ఎన్నికలకు సంబంధించి చేయవలసిన ఏర్పాట్లపై జ్యోతి బసు ఎంపీడీవోలకు పలు సూచనలు చేశారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన శిక్షణ కూడా ఇవ్వటం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమానికి గురజాల డీఎల్‌డీవో గబ్రూ నాయక్, పెదకాని ఈవోపీఆర్‌డీ కే శ్రీనివాసరావు రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరించారు. ఈ శిక్షణా కార్యక్ర మానికి పిట్టలవానిపాలెం, భట్టి ప్రోలు, దుగ్గిరాల, గుంటూరు రూరల్, తెనాలి, అచ్చం పేట, కారంపూడి, నరస రావుపేట, ముప్పాళ్ల మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ఎన్నికల నిర్వహణకు జిల్లా కలెక్టర్లచే నియమించబడిన ప్రిసైడింగ్ అధికారులు హాజరయ్యారు.

పరీక్షల వేళ.. పెరిగిన కోతలు

(5వ పేజీ తరువాయి)

ఉండని పరిస్థితులు ఎదుర్కొంటున్నట్లు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక ఎప్పుడు విద్యుత్ సరఫరా ఉంటుందో, పోతుందో తెలియని పరిస్థితులున్నాయి. సాంకేతిక కారణాలని అధికారులు పైకి చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో విద్యుత్‌శాఖ వైఫల్యంపై అనేక విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని సెక్షన్ల పరిధిలో విద్యుత్‌లైన్ల నిర్వహణ కోసం లైన్ క్లియరెన్స్ (ఎల్‌సీ) పేరుతో రోజుల తరబడి పనులు చేస్తుండటం కూడా ప్రజల్లో అసహనం కలిగిస్తోంది. ప్రతి నెలలో రెండో శనివారం విద్యుత్‌లైన్ల నిర్వహణ కోసం విద్యుత్ సరఫరా నిలిపివేసి ఉదయం నుంచి మధ్యాహ్నం, కొన్ని ప్రాంతాల్లో సాయంత్రం వరకు విద్యుత్ సిబ్బంది పనులు చేస్తున్నారు. అది చాలదన్నట్లు సాధారణ రోజుల్లోనూ పనులు చేస్తున్నారు. ప్రస్తుతం పెరుగుతోన్న వేసవితో గుంటూరు సర్కిల్ పరిధిలోని ఐదు మిలియన్ యూనిట్లకు పైగా వినియోగం పెరిగింది. ఇక ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో గుంటూరు, పల్నాడు, బాపట్ల సర్కిల్స్‌లో దాదాపు 15 మిలి యన్ యూనిట్లపైనే విద్యుత్ వినియోగం జరుగుతుంది. విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి ఉన్నప్పటికీ అంతరాయాలు రావటం అధికారుల వైఫల్యానికి అద్దం పడుతోంది.

స్టోర్స్‌లో పరికరాల్లేవంటూ విమర్శలు....

విద్యుత్ లైన్లకు సంబంధించి 11 కేవీ తీగెలు, స్విచ్‌లు, ఎర్త్ వైర్లు, కండక్టర్‌లు, కేబుల్స్ వంటివి సెక్షన్ కార్యాలయాల పరిధిలో అందుబాటులో ఉండటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని సెక్షన్ల పరిధిలో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తున్నా పట్టించుకున్న నాధుడే ఉండటం లేదని సిబ్బంది వాపోతున్నారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాపం ఇప్పుడు శాపంగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని సెక్షన్‌లలో ఒకరు మాత్రమే లైన్‌మెన్ ఉండటం కూడా విద్యుత్ అంతరాయాలకు కారణాలుగా చెబుతున్నారు.

90 శాతం టెండర్లు.. 15 రోజుల్లో పనులు

తుళ్లూరు, మంగళగిరి, గుంటూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని వైసీపీ చేస్తున్న వాదన సరైనది కాదు. ప్రజలపై ఒక్క రూపాయి కూడా భారం పడకుండా రాజధాని నిర్మాణం చేపడుతున్నాం. రాజధాని నిర్మాణం పూర్తయితే భూముల విలువ పెరుగుతుంది. సంపద సృష్టి జరుగుతుంది. దానితో రాజధాని కోసం చేసిన రుణాలను తీర్చవచ్చు.' అని రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి పొంగూరి నారాయణ స్పష్టం చేశారు. రాజధాని అమరావతిలో మంగళవారం ఆయన పర్యటించారు. నిర్మాణంలో ఉన్న కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శుల భవనాలు, సీఆర్డీఏ ప్రాజెక్టు కార్యాలయాన్ని పరిశీలించారు. రాయపూడి రెవెన్యూలో నిర్మాణంలో ఉన్న శాఖాధిపతుల బంగ్లాలను పరిశీలించారు. అనంతరం సీఆర్డీఏ జోనల్ కార్యాలయాన్ని సందర్శించారు. పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని కెసీపీ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ప్రతినిధులు మంత్రికి వివరించారు. పనులలో జాప్యం జరిగితే సహించేది లేదని మంత్రి వారికి సూచించారు. ఏప్రిల్ 20కి ఆరు అంతస్థులకు నాలుగు అంతస్థులు పూర్తి చేసి అప్పచెపతామన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పునర్నిర్మాణ పనులకు సంబంధించి 90 శాతం టెండర్లు పూర్తయ్యాయని తెలిపారు. క్లీనింగ్‌తో మొదలైన పనులు మరో 15 రోజుల్లో కాంట్రాక్టర్లకు మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయని, ఆ తర్వాత పూర్తిస్థాయిలో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. కార్యదర్శి ప్రధాన కార్యదర్శుల భవనాలు పరిశీలిం చామని, 186 భవనాలు మంత్రులు, హైకోర్టు జడ్జీలు, కార్యదర్శులు ప్రధాన కార్యదర్శులకు అందుబాటులోకి తెస్తామన్నారు. వాటితోపాటు గెజిటెడ్ అధికారులకు 1440, ఎన్జీవోలకు 1,995 ప్లాట్ల నిర్మాణాలు పూర్తవగా, 16.85 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో హైకోర్టు భవనం, 250 మీటర్ల ఎత్తులో వ్యూ పాయింట్ ఉండేలా అసెంబ్లీ భవనం వస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల అమరావతిని పాడుపెట్టడంతో పాటు రాజధాని పనులను సమస్య జఠిలం చేసిందని మంత్రి తెలిపారు. నిర్మాణ సంస్థలకు బిల్లులు ఇవ్వకుండా తరిమేసిందని, వాటిని క్లియర్ చేసి నూతనంగా పనులకు టెండర్లు కేటాయిస్తున్నా మన్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం పనులు పూర్తి చేస్తామన్నారు. లండన్‌కు చెందిన నార్మన్ ఫాస్టర్ కంపెనీ ఐకానిక్ టవర్ల డిజైన్ తయారు చేసినట్లు చెప్పారు.

రంగంలోకి కాంట్రాక్టు సంస్థలు.. చురుగ్గా పనులు

అమరావతి నిర్మాణ పనులపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ప్రభుత్వ భవనాలను ఏడాదిలోగా పూర్తి చేయాలని కాంట్రాక్టు సంస్థలకు ముందస్తుగానే డెడ్‌లైన్‌ను విధించింది. నిర్ణీతగడువులోగా నిర్మాణ పనులను పూర్తిచేసి అప్పగించాల్సిందేనని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో కాంట్రాక్టు ఏజెన్సీలు పనులకు సంబంధించి ఉత్తర్వులను అందుకుందే ఆలస్యంగా క్షేత్రస్థాయిలోకి దిగిపనులను ముమ్మరంగా జరిపిస్తున్నాయి. ఈ క్రమంలో మంత్రులు, జడ్జీల తాలూకు బంగ్లాలతోపాటు, ఏఐఎస్, ప్రిన్సిపల్ కార్యదర్శుల బంగ్లాలు శరవేగతిన పూర్తిచేసే లక్ష్యంతో కాంట్రాక్టు ఏజెన్సీలు తమతమ యంత్రాంగాన్ని రంగంలోకి దించాయి. సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయ భవనం దాదాపు ప్రారంభ దశకు చేరుకుంటుండగా, సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్సెస్ లాబొరేటరీ భవనసముదాయం పనులు చాలా వరకు పూర్తయ్యాయి. 2019 నాటికి మొదలుపెట్టి చాలావరకు పూర్తయిన ప్రభుత్వ క్వార్టర్స్ పనుల పూర్తికి కాంట్రాక్టు సంస్థలు రంగంలోకి దిగాయి. ఏఐఎస్ కార్యదర్శుల బంగ్లాలకు రూ.411.37 కోట్లు, మంత్రులు, న్యాయమూర్తుల విల్లాలకు రూ.401.37 కోట్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్వార్టర్లకు రూ.300 కోట్ల వంతున ఖర్చు చేస్తున్నారు.

అమరావతిలో ప్రభుత్వ భవనాల పనుల పరిశీలనలో మంత్రి నారాయణ


కార్యదర్శుల భవనాల వద్ద మంత్రి నారాయణ

మిర్చి రైతుల నిరసన

ధర తగ్గించడంతో రోడ్డెక్కిన రైతులు

గుంటూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు వివిధ ప్రాంతాల నుంచి ఎండుమిరపకాయలు అమ్ముకొనేందుకు వస్తున్న రైతులకు ఇక్కడి వ్యాపారస్థులు తీవ్ర మనోవేదన కలిగిస్తున్నారు. నాణ్యత సరిగా లేదని చెబుతూ ధర గణనీయంగా తగ్గిస్తున్నారు. ఇష్టమైతే అమ్మండి లేకుంటే మీ సరుకు తీసుకెళ్లండంటూ మొండిగా వ్యవహరిస్తున్నారు. దీంతో కడుపు కాలిన మిర్చి రైతులు మంగళవారం మిర్చి యార్డు గేట్లకు తాళం వేసి నల్లపాడు రోడ్డులో జాతీయ రహదారిపై నాలుగు గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. తమకు గిట్టుబాటు ధర కావాలని నినాదాలు చేశారు. కలెక్టర్ వచ్చి సమాధానం చెబితేనే ఆందోళన విరమిస్తామని అక్కడికి వచ్చిన పోలీసు అధికారులకు తేల్చి చెప్పారు. రైతుల ఆందోళన సున్నితమైనది కావడంతో పోలీసులు సంయమనం పాటించారు. వాహనదారులు, బస్సుల్లో ఉన్న ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారని, ఆందోళన విరమించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. చివరికి మిర్చియార్డు పర్సన్ ఇన్‌ఛార్జ్, జాయింట్ కలెక్టర్ అమిలినేని భార్గవతేజ, ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక వచ్చి చర్చలు జరిపి తాము ప్రభుత్వానికి నివేదించి కనీస మద్దతు ధర వచ్చేలా ప్రయత్నిస్తామని హామీ ఇచ్చి ఆందోళనను విరమింపచేశారు. రైతులు తమ ఆధార్, ఈ-క్రాప్ బుకింగ్, బ్యాంకు అకౌంట్ వివరాలను యార్డు పరిపాలన భవనంలో సమర్పించాలని కోరారు. రైతులు కోరిన విధంగా మిర్చి ధరలు ఎప్పటికప్పుడు తెలిసేలా ఎలక్ట్రానిక్ డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. మిర్చి రైతులు సుమారు నాలుగు గంటల పాటు రాస్తారోకో చేయడం వలన నల్లపాడు రోడ్డులో ట్రాఫిక్ స్తంభించిపోయింది. మరోవైపు పోలీసులు చుట్టుగుంట వద్దనే ట్రాఫిక్‌ని మళ్లించారు. అలానే హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న వాహనాలను నల్లపాడు వద్ద ఇన్నర్ రింగు రోడ్డులో నుంచి చిలకలూరిపేట హైవే వైపు మళ్లించారు.

రైతుల ఆందోళన వెనక వైసీపీ పాత్రపై అనుమానాలు

మిర్చి రైతులు హఠాత్తుగా ఆందోళనకు దిగడం వెనక వైసీపీ సానుకూల వ్యాపారస్థులు ఉన్నట్లు మార్కెటింగ్ అధికారులు అనుమానిస్తున్నారు. గత ఏడాది మిర్చి యార్డులో ఒక ట్రేడర్ పల్నాడు జిల్లా అచ్చంపేటకు చెందిన రైతుల మిర్చిని అమ్మేసి దాదాపుగా రూ. 50 లక్షలు బకాయి పడ్డాడు. అయితే అతను ఆ నగదు చెల్లించకపో తుండటంతో రైతులు ఇటీవలే ధర్నా కూడా చేశారు. అలానే కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఇతర నాయకులను కలిసి తమ సమస్యని నివేదించారు. దీనిపై మార్కెటింగ్ శాఖ స్పందించి ఎవరైతే రైతులను మోసం చేశాడో ఆ వ్యాపారి లైసెన్సుని ఇటీవలే సస్పెన్షన్ చేశారు. అయినప్పటికీ అతను యార్డులో మరో ముగ్గురు వ్యాపారస్థులతో చేతులు కలిపి తన వ్యాపారానికి అడ్డం లేకుండా వారి ముసుగులో ట్రేడింగ్ చేస్తున్నాడు. దీనిపై రైతులు ఫిర్యాదు చేయడంతో సోమవారం ఆ ముగ్గురు వ్యాపారస్థులకు కూడా నోటీసులు, షోకాజ్‌లు జారీ చేసి లైసెన్సులను నిలుపుదల చేశారు. ఈ పరిణామం జరిగిన కొద్ది గంటల్లోనే రైతులు రోడ్డెక్కడం వెనక కచ్చితంగా వాళ్లే రైతులను రెచ్చగొట్టారని అధికారులు ఆరోపిస్తున్నారు. మంగళవారం రాస్తారోకో ప్రారంభం సమయంలో వైసీపీ మద్దతుదారులు రైతులతో పాటు ఉండడంతో అనుమానాలు బలపడుతున్నాయి.


నల్లపాడు రోడ్డులో స్తంభించిపోయిన వాహనాలు

- ఇతర రాష్ట్రాల నుంచి వలస వస్తున్న కూలీలు
- కూలీల కోసం ఏర్పాటవుతున్న తాత్కాలిక షెడ్లు
- భారీగా వస్తున్న యంత్రసామగ్రి

కళకళలాడుతున్న అమరావతి

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజధాని అమరావతి ప్రాంతమంతా నిర్మాణుష్యంగా ఉండేది. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ ఈ ప్రాంతంలో ఆశలు చిగురించాయి. దానికి ఊతమిస్తూ, అరణ్యంలా మారిన అమరావతిలో వందలకొద్దీ ఎక్స్‌కవేటర్లతో చెట్లు, కంపతొలగింపు పనులను చాలా వరకు ప్రభుత్వం జరిపించింది. అయితే వెనువెంటనే రాజధాని నిర్మాణ పనులను మొదలుపెట్టడానికి ఎన్నో సమస్యలు, న్యాయపరమైన చిక్కుముడులు అడ్డొచ్చాయి. వాటన్నింటిని క్రమంగా చేదించుకుంటూ నిధులను సమకూర్చుకుంటూ... నేడు ఏకంగా రమారమి రూ. 50 వేల కోట్ల విలువైన నిర్మాణ పనులను మూకుమ్మడిగా చేపట్టి రాజధాని ప్రాంత వాసులను ఆనందడోలికల్లో ముంచెత్తుతున్నది. దీంతో, అమరావతి పాత, కొత్త వీధులు మళ్లీ జనసామర్థ్యంతో కిక్కిరిస్తున్నాయి. కొత్తకొత్త హోటళ్లు, టీ కొట్లు, బడ్డీ కొట్లు ఇబ్బడిముబ్బడిగా పుట్టుకొస్తున్నాయి. రాజధాని నిర్మాణ పనుల్లో పాలుపంచుకునేందుకు వస్తున్న భారీ యంత్రసామగ్రితో అమరావతి హోరెత్తుతున్నది. ఇతర రాష్ట్రాల నుంచి తరలివస్తున్న కూలీలతో అమరావతి మళ్లీ కళకళలాడుతోంది.

రాజధాని అమరావతిలో నిర్మాణపనులు చేయడానికి టెండర్లను దక్కించుకున్న బడా కాంట్రాక్టు సంస్థలు అప్పుడే కార్యరంగంలోకి దిగిపోయాయి. తామే ఏయే ప్రాజెక్టులను చేపట్టబోతున్నామో ఆయా ప్రాంతాల్లో ఆయా నిర్మాణాలకు సంబంధించిన భారీ యంత్ర పరికరాలను చేరవేసుకుంటున్నారు. ఇవన్నీ హైదరాబాద్, బెంగళూరు, ముంబై వంటి దూరప్రాంతాల నుంచి ఇక్కడికి తరలివస్తున్నాయి. ఈ యంత్ర సామగ్రితో పాటుగా కూలీ పనులను చేసేందుకు ప్రతీ కాంట్రాక్టు సంస్థ ఒరిస్సా, బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి వేలాదిమందిని అమరావతికి రప్పిస్తున్నారు. వీరందరికీ పనిచేయాల్సిన ప్రాంతాలలో భారీ షెడ్లను ఏర్పాటుచేసి వారికి తాగునీరు, టాయ్‌లెట్లు వంటి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు. అంతేకాకుండా ఎక్కడికక్కడ రెడీమిక్స్ ప్లాంట్లు కూడా పెద్దఎత్తున ఏర్పాటవుతున్నాయి.

ఇదిలావుండగా రాజధాని అమరావతిలో ఏప్రిల్ మూడవ వారంలో జరుగనున్న ప్రధాని మోదీ సభకోసం వచ్చే అతిథులను ఆకట్టుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీడ్ యాక్సిస్‌తో పాటు ఇతర ప్రధాన వీధుల వెంబడి మొక్కలను నాటించే కార్యక్రమాన్ని చేపట్టింది.


అమరావతి ప్రధాన వీధుల వెంబడి మొక్కలను నాటుతున్న దృశ్యం


యంత్రాల సాయంతో ఆగర్లలోకి ఐరన్ బుట్టలను దించుతున్న దృశ్యం


అమరావతిలో కూలీల కోసం తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్న షెడ్లు

వినుకొండలో రేషన్ షాపులపై విజిలెన్స్ దాడులు

వినుకొండ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వినుకొండలోని రేషన్ షాపులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్పీ దువ్వారపు సూర్యశ్రావణ్ కుమార్ ఆదేశాల నేపథ్యంలో మండల స్థాయి స్టాక్ పాయింట్‌తో పాటు, పలు రేషన్ షాపులను తనిఖీ చేశారు. ఆయా రేషన్ షాపుల్లో వినియోగిస్తున్న కాటాలు, నిల్వలను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్లలో నమోదు చేసిన నిల్వలపై ఆరా తీశారు. ఈ దాడుల్లో విజిలెన్స్ సీఐ పి.శివాజీతో పాటు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోండి : కమిషనర్ శ్రీహరిబాబు

చిలకలూరిపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరులోపు పట్టణ ప్రజలు ఆస్తి పన్ను బకాయిలను చెల్లించిన వడ్డీపై 50శాతం రాయితీని పొందాలని, ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ పి.శ్రీహరి బాబు మంగళవారం కోరారు. ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయిలు ఏక మొత్తంలో చెల్లించే వారికి ఈ రాయితీ వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు.

డీఎస్సీ బీసీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ: శివనాగేశ్వరరావు

నరసరావుపేట రూరల్, మార్చి 24, (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2025 పరీక్షలకు అభ్యర్థులకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారిక అధికారి శివనాగేశ్వరరావు తెలిపారు. పలనాడు జిల్లాలో డీఎస్సీ 2025 రిక్రూట్‌మెంట్ పరీక్షలకు అరు లైన బీసీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానించినట్లు శివ నాగేశ్వరరావు తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను మార్చి 29లోపు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారత అధికారి కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ పొందేందుకు టెట్ క్వాలిఫై అయినా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి సమాచారంకోసం నరసరావుపేట పట్టణంలోని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారిక కార్యాలయం, తిలక్ స్కూల్ పక్కన, ప్రకాష్‌నగర్, రిక్షా సెంటర్, నరసరావుపేటలో సంప్రదించాలని కోరారు.

సంగం డెయిరీని సందర్శించిన ఎన్ఈసీ కళాశాల విద్యార్థులు

నరసరావుపేట రూరల్, మార్చి 24, (ఆంధ్రజ్యోతి): స్థానిక నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు పారిశ్రామిక పర్యటనలో భాగంగా గుంటూరు జిల్లా వడ్లమూడిలోని సంగం డెయిరీని మంగళవారం సందర్శించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మిట్టపల్లి రమేష్‌బాబు, కళాశాల వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ ప్రత్యేక క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోండి

● మునిసిపల్ కమిషనర్

వినుకొండ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధార్ సర్వీసులకు సంబంధించిన నూతన ఆధార్‌కార్డులు ఎన్‌రోల్‌మెంట్ చేయుటకు, బయోగ్రాఫిక్, ఆధార్ డౌన్‌లోడ్ చేయుటకు, కలర్ ప్రింట్ మొదలగు సర్వీసులను ఈ నెల 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25,26,27,28 తేదీల్లో మునిసిపల్ కార్యాలయ ఆవరణలోని లాయర్‌స్ట్రీట్ 4వ సచివాలయంతో పాటు ఓబయ్య కాలనీలోని 9వ సచివాలయంలో ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు ప్రజా దర్బార్

వినుకొండ టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయం ఆవరణలో బుధవారం ఉదయం 10 గంటలకు ప్రజాదర్బార్ కార్యాలయం సిబ్బంది మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ సమస్యలపై ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులును కలిసి సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

నవోదయకు ఇద్దరు ఎంపిక

చిలకలూరిపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం రామచంద్రపురం గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు మద్దిరాలలోని జవహర్ నవోదయ విద్యాలయం ఆరో తరగతి పరీక్షల్లో పాసై పాఠశాలకు ఎంపికయ్యారు. విద్యార్థులను చిలకలూరిపేట మండల విద్యాశాఖ అధికారులు ఎ.శ్రీనివాసరావు, వీవీఎస్ రత్నకళ మండల విద్యా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

కూరగాయల మార్కెట్, సండ్రీ మార్కెట్‌ల వేలం రద్దు

చిలకలూరిపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట పురపాలక సంఘ పరిధిలోని మాంసం, చేపలు, కూరగాయలు, సండ్రీ మార్కెట్‌లకు వేలం నిర్వహించినట్లు మునిసిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు మంగళవారం తెలిపారు. మటన్, ఫిష్ మార్కెట్లకు సంబంధించి గత ఏడాది కంటే హెచ్చుగా పాట పాడారని చెప్పారు. కూరగాయల మార్కెట్, సండ్రీ మార్కెట్ వేలం గత ఏడాది కంటే తక్కువగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ కారణంవల్ల కూరగాయల మార్కెట్, సండ్రీ మార్కెట్‌ల వేలంను వాయిదా వేసినట్లు వెల్లడించారు. వీటిని ఈ నెల 27వ తేదీ తిరిగి నిర్వహిస్తామని, ఆ రోజు కూడా తక్కువగా పాడితే ఆ పాటను రద్దుచేసి సచివాలయ ఉద్యోగుల సేవలను ఉపయోగించుకుంటామన్నారు. ఎవరైనా వేలంలో పాల్గొనే వారు ఈ నెల 27వ తేదీ హాజరుకావాలని సూచించారు.

సీహెచ్‌సీల్లో గోల్డెన్ అవర్ ఇంజక్షన్

● గుండెపోటు బారినపడే పేదలకు వరం టెనెక్టెప్లస్

● పల్నాడు జిల్లాలో పది సెంటర్లలో అందుబాటులోకి



అందుబాటులో ఉన్న ఇంజక్షన్



వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలో నూతనంగా ఏర్పాటుచేసిన గది

వినుకొండ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గుండెపోటు మరణాలను నివారించేందుకు ఖరీదైన టెనెక్టెప్లస్ పేరు గలిగిన ఖరీదైన ఇంజక్షన్‌ను ఉచితంగా అందించేందుకు కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పల్నాడు జిల్లాలో గుంటూరులో జీజీహెచ్‌లో మాత్రమే అందుబాటులో ఉండే ఈ ఇంజక్షన్ ఇప్పుడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు కూడా సరఫరా చేస్తున్నారు. గుండెపోటు బారిన పడిన బాధితులు ప్రాణాలు కాపాడుకునేందుకు ఇప్పటివరకు జిల్లాల్లో 117మందికి అత్యవసరంగా ఇంజక్షన్ అందజేశారు.

గుండె జబ్బులకు కారణాలు

అధిక రక్తపోటు, షుగర్‌తో పాటు మారిన జీవన ప్రమాణాలు కారణంగా శరీరంలో కొవ్వు నిల్వలు పేరుకుపోయి చిన్నవయసులోనే గుండె జబ్బులు వస్తున్నాయి. స్త్రీ, పురుషులని బేధం లేకుండా ఈ వ్యాధి బారిన పడుతున్నారు. వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరితో లక్షల్లో ఖర్చవుతోంది. ప్రధానంగా చిన్న పట్టణాలు, గ్రామాల్లో నివసరించే వారికి గుండె వైద్యనిపుణులు అందుబాటులో ఉండరు. ఈ వ్యాధిబారిన పడిన వారు దూరప్రాంతాల్లో ఉన్న ముఖ్యమైన ఆసుపత్రికి వెళ్లే లోపు ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోంది. గుండెలో నొప్పి వచ్చిన వెంటనే మొదటి గంటలోపు ఇంజక్షన్ ఇవ్వాలని, దీనినే గోల్డెన్ అవర్‌గా అని డాక్టర్లు చెబుతుంటారు. ఈలోపు అవసరమైన చికిత్స అందిస్తే ప్రాణాలతో బయట పడగలరు. ఇందులో కీలకమైందే టెనెక్టెప్లస్ ఇంజక్షన్. ఇప్పుడు ఇంజక్షన్‌ను ఉచితంగా అందుబాటులో ఉంచడం వలన పేద వర్గాల ప్రాణాలకు భరోసా కల్పించినట్లు అవుతుంది.

తీవ్రతనుబట్టి ఇంజక్షన్లు: డాక్టర్ రంగారావు



అన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో టెనెక్టెప్లస్ ఇంజక్షన్లు ఆసుపత్రి అవసరాలను బట్టి అందుబాటులో ఉంచామని పల్నాడు జిల్లా వైద్య విధాన పరిషత్ కో ఆర్డినేటర్ డాక్టర్ రంగారావు తెలిపారు. గుండెనొప్పి వచ్చిన వారిని ఈసీజీ తీసి ఛాతీనొప్పి తీవ్రతను బట్టి ఇంజక్షన్ వేయడం జరుగుతుందని తెలిపారు. రక్తనాళంలో రక్తం గడ్డకట్టకుండా ఈ ఇంజక్షన్ ఎంతగానో ఉపయోగపడుతుందని, రెండోసారి ఈసీజీ తీసి జీజీహెచ్ గుండె వైద్య నిపుణులకు పంపించడం జరుగుతుందని తెలిపారు.

పల్నాడు జిల్లాలో...

పల్నాడు జిల్లాలో పది ఆసుపత్రుల్లో ఇంజక్షన్ అందుబాటులో ఉంచారు. నరసరావుపేట, మాచర్ల, సత్తెనపల్లి, చిలకలూరిపేట, అమరావతి, విజయపురిసౌత్, పెదకూరపాడు, గురజాల, ఈపూరు, వినుకొండ ఆసుపత్రులు ఈ జాబితాలో ఉన్నాయి. ఈ ఆసుపత్రుల్లో ఉన్న సిబ్బందికి ఈ ఇంజక్షన్ ఎలా చేయాలో ఇప్పటికే శిక్షణ కూడా ఇప్పించారు. ఇందుకోసం ప్రతి వైద్యశాలలో ప్రత్యేక బెడ్, ఈసీజీ తదితర సౌకర్యాలు కూడిన గది ఏర్పాటు చేశారు. పల్నాడు జిల్లాలో 20వ తేదీ వరకు జిల్లాలో సరఫరా అయిన ఇంజక్షన్లు 141 గాను 117 ఇంజక్షన్లు ఇప్పటివరకు వినియోగించారు. మరో 24 అందుబాటులో ఉన్నట్లు వైద్యాధికారులు తెలిపారు. ఆసుపత్రుల వారీగా నరసరావుపేటలో 3, మాచర్లలో 3, సత్తెనపల్లిలో 3, చిలకలూరిపేటలో 3, అమరావతిలో 3, విజయపూరిసౌత్‌లో 2, పెదకూరపాడులో 2, గురజాలలో 2, వినుకొండలో 1 మొత్తం 141 ఇంజక్షన్లకుగాను 117 వినియోగించారు. మరో 24 ఇంజక్షన్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

మాతా,శిశు మరణాలు సున్నాస్థాయికి చేరేలా పనిచేయాలి

వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో జీవీ



వైద్యాధికారులతో సమావేశమైన చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వినుకొండ నియోజకవర్గంలో మాతా శిశు మరణాలు సున్నాస్థాయికి చేర్చడమే లక్ష్యంగా వైద్యులు పనిచేయాలని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. టీడీపీ కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య అధికారులతో జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ నియోజక వర్గంలోని వైద్యశాలలో ఎక్కడైనా మాతా, శిశు మరణాలు సంభవిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ వైద్యశాలలో పనిచేస్తున్న వైద్యులు పని ప్రదేశాల్లో నివాసం ఉండాలని హెచ్చరికలు జారీచేశారు. విధుల్లో సమయపాలన పాటించాలని, కాన్పులన్నీ ఆస్పత్రుల్లోనే జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా ఇంటి వద్ద ప్రసవం జరిగిందని తెలిస్తే ఊరుకునే ప్రసక్తి లేదని అధికారులకు స్పష్టం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో తప్పనిసరిగా యాంటీ వీనమ్ ఇంజెక్షన్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వినుకొండ, ఈపూరు సీహెచ్‌సీల్లో గుండెపోటుకు గురైన వారికి ఇచ్చే ఖరీదైన ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తగా వ్యవహరించి తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ రవి కుమార్, వినుకొండ, ఈపూరు ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ అబ్దుల్ రజాక్, డాక్టర్ హేమలత పాటు మండలాల వైద్య అధికారులు పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్ చట్టాన్ని సవరించాలి: కేసన శంకరరావు

వినుకొండ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మహిళా భాగస్వామ్యాన్ని 3వ వంతుకు పెంచేందుకు ఉద్దేశించిన మహిళా రిజర్వేషన్ చట్టంలో ఓబీసీ మహిళలకు సబ్ కోటాను ఇస్తూ సవరణ చేసిన తరువాతే బిల్లును అమలు జరపాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు డిమాండ్ చేశారు. పల్నాడు రోడ్డులోని డాక్టర్ చలపతిరావు ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో నూతన పార్లమెంటు భవనంలో మొట్టమొదటి రోజున ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి నారీశక్తి వందన్-2023 పేరిట చట్టసభల్లో 33శాతం మహిళలకు రిజర్వేషన్ కేటాయిస్తూ చట్టం చేయడం దేశ రాజకీయాల్లో ఓ చారిత్రాత్మక ఘట్టమన్నారు. ఈ చట్టంవల్ల పార్లమెంటులో 3వ వంతు ఓసీ మహిళలతోనే నింపబడుతుందన్నారు. ఓబీసీ మహిళలకు ఇప్పటి మహిళా రిజర్వేషన్ చట్టం వల్ల ఒనగూరే ప్రయోజనం లేదన్నారు. ఓబీసీ మహిళలకు సబ్‌కోటా ఇవ్వకుండానే మహిళా రిజర్వేషన్ చట్టం అమలు చేయాలనుకోవడాన్ని దేశంలో మొత్తం ఓబీసీ సమాజం, ముఖ్యంగా ఓబీసీ మహిళాలోకం ముక్తకంఠంతో ఖండిస్తోందని శంకరరావు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన అధ్యక్షుడు కుమ్మరి క్రాంతికుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీనివాసరావు, నియోజకవర్గ అధ్యక్షులు న్యాయవాది సిద్దయ్య, బీసీ నాయకులు న్యాయవాది సైదారావు, మల్లెల సాంబశివరావు, పాశం నాగమల్లేశ్వరరావు, మీసాల మురళి, శివ, కొండలు, వెంకటేశ్వర్లు, శ్రీను, మీసాల శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

రేషన్ కార్డులకు ఆధార్ ఈకేవైసీ అనుసంధానం

వినుకొండ టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డులకు ఆధార్ ఈకేవైసీ అనుసంధానం ఈ నెల 31తో ముగియనున్న నేపథ్యంలో వినుకొండ తహసీల్దార్ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో హాస్టల్‌లోని విద్యార్థుల ఈకేవైసీ రేషన్‌కార్డులకు అనుసంధానం మంగళవారం చేపట్టారు. ఈ సంధ్బంగా ఆయన మాట్లాడుతూ రేషన్‌కార్డులో ఈకేవైసీ లేకపోవడం కారణంగా విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని, హాస్టల్‌లో చదివే విద్యార్థులకు రేషన్ డీలర్లను, గ్రామ రెవెన్యూ అధికారులను పంపి ఆధార్ ఈకేవైసీలను రేషన్‌కార్డులో లింక్ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఈ కేవైసీని వేగవంతం చేయాలి

నరసరావుపేట రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రేషన్ కార్డులకు ఆధార్ ఈ కేవైసీ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి మురళి ఆదేశించారు. 31వ తేదీతో రేషన్ కార్డు ఆధార్ అనుసంధానం ముగియనున్నదన్నారు. పల్నాడు జిల్లాలో హాస్టల్లో చదువుకుంటున్న విద్యార్థులకు రేషన్ డీలర్లు గ్రామ రెవెన్యూ అధికారులు ఈ కేవైసీ ప్రక్రియను చేపట్టాలని సూచించారు. హాస్టల్లో చదువుకుంటున్న విద్యార్థులు వేరే వేరే మండలాలకు చెందినవారైనా వారి ఆధార్ అనుసంధానం ప్రక్రియ పూర్తిచేయాలని సూచించారు. మంగళవారం వినుకొండ పట్టణంలో విద్యార్థుల ఈ కేవైసీ పూర్తయిందని జిల్లాలోని అన్ని మండలాల సమన్వయంతో ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.

ఏఎంరెడ్డి కళాశాల విద్యార్థుల ఫ్లాష్‌మాబ్



పట్టణంలోని పల్నాడు బస్టాండ్‌లో ఫ్లాష్‌మాబ్ నిర్వహిస్తున్న ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ విద్యార్థులు

నరసరావుపేట టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల వ్యసనాన్ని నివారించేందు ప్రజలకు అవగాహన కల్పించేందుకు నరసరావుపేట పట్టణంలో ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు హ్యాక్ మేనియా 2కె25 ప్రచార కార్యక్రమం ఫ్లాష్‌మాబ్ మంగళవారం నిర్వహించారు. ఫ్లాష్‌మాబ్ పల్నాడు బస్టాండ్ నుంచి మోర్ సెంటర్, ప్రకాశ్ నగర్‌లోని రిక్షా సెంటర్ మీదగా నరసరావుపేట బస్టాండ్ వద్ద ముగిసింది. విద్యార్థులు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలను తమ ప్రదర్శన ద్వారా తెలియజేశారు. యువత ఈ వ్యసనాలకు బానిస కాకుండా, ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించాలనే సందేశాన్ని అందించారు. కార్యక్రమ విజయవంతానికి సహకరించిన పోలీస్ శాఖకు కళాశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలియజేశారు. కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి సహకరించిన పోలీస్ శాఖకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ మల్లికార్జున్, డిప్లొమా ప్రిన్సిపాల్ డాక్టర్ కే కృష్ణారెడ్డి, అకడమిక్ డీన్ డాక్టర్ ఎ కిశోర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శిగా సుబ్బారెడ్డి

నరసరావుపేట రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఎన్నికలు మంగళవారం జరిగాయి. పల్నాడు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి వై.వి. సుబ్బారెడ్డి ఆంధ్రప్రదేశ్ స్విమ్మింగ్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా ఎన్నికయ్యారు.

డిగ్రీ కళాశాలల అధ్యక్షుడిగా శ్రీనివాసరావు ఎన్నిక

నరసరావుపేట టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్శిటీ అనుబంధ డిగ్రీ కళాశాల యాజమాన్య సంఘం సమావేశం మంగళవారం నరసరావుపేట పట్టణంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో సమావేశం జరిగింది. సంఘం అధ్యక్షుడిగా ఆర్.శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడిగా వీవీ ప్రసాద్, జనరల్ సెక్రటరీగా పి.రాజశేఖర్, ఫైనాన్స్ సెక్రటరీగా ఎం.శ్రీనివాసరవు, వైస్ ప్రెసిడెంట్‌గా వై వెంకట్రామయ్య, జాయింట్ సెక్రటరీగా వీరవల్లి శ్రీనివాసరావులు ఎన్నికయ్యారు.

క్షయవ్యాధిపై కార్మికులకు అవగాహన

యడ్లపాడు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన నరేంద్ర సువర్ణ కుమారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. తిమ్మాపురం వసంత స్పిన్నింగ్ మిల్లులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం క్షేత్ర సహాయకులతో క్షయవ్యాధిపై ఫౌండేషన్ అధ్యక్షురాలు సువర్ణకుమారి కార్మికులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం యడ్లపాడులోని మసీదులో ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు ప్రసాద్, డీఈవో శ్యామ్, ఏఎన్ఎం కె.నాగమణి పాల్గొన్నారు.

నేడు రుణ మేళా

నాదెండ్ల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నాదెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం రుణమేళా జరుగుతుందని ఎంపీడీవో ఎస్.స్వరూపరాణి తెలిపారు. ఉదయం 10:30 గంటలకు జరిగే రుణమేళాకు అన్ని బ్యాంకులకు చెందిన సెలక్షన్ కమిటీ సభ్యులు 2024 - 25 సంవత్సరానికి సంబంధించి బీసీ, ఈబీసీ, కాపు, జనరిక్ ఫార్మసీలకు సంబంధించి రుణ మేళా నిర్వహించనున్నట్లు ఆమె వివరించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సంబంధిత ధృవీకరణ పత్రాలతో రుణమేళాకు హాజరు కావాలని కోరారు.

పీఏసీఎస్ అందిస్తున్న సేవలపై అవగాహన

యడ్లపాడు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025ను పురస్కరించుకుని యడ్లపాడు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయంలో సంఘ సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీపర్సన్ ఇన్‌చార్జి పీబీ మాట్లాడుతూ సంఘ రికార్డుల కంప్యూటరీకరణ, సంఘం అందిస్తున్న సేవల గురించి సభ్యులకు వివరించారు. సంఘం సీఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏప్రిల్ 1 నుంచి డిజిటల్ లావాదేవీలు, ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

నేషనల్ మీట్ టెన్నీకాయిట్‌లో ఎంఎఎం విద్యార్థులకు ప్రథమ స్థానం

నరసరావుపేట టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మీట్ టెన్నీకాయిట్ విభాగంలో ఎంఎఎం కళాశాల విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచారని కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య మంగళవారం తెలిపారు. విజ్ఞాన్‌లో జరిగిన నేషనల్ మీట్‌లో ఈ ఘనత సాధించారన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన ఎస్.గౌరీ, ఎస్ శిరీషలను కళాశాల చైర్మన్ ఎంఆర్ శేషగిరిరావు, పీడీ సన్నీ డేనియల్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రామారావు, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

అగ్నిప్రమాదంలో మూడు పూరిళ్లు దగ్ధం

వినుకొండ టౌన్, మార్చి 25, (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు మూడు పూరిళ్లు దగ్ధమైన సంఘటన పట్టణ సమీపంలోని వెన్నపూస కాలనీలో మంగళవారం చోటు చేసుకుంది. ఫైర్ అధికారి నాగేశ్వరరావు తెలిపిన తెలిపిన వివరాలను ప్రకారం ప్రమాదవశాత్తు తిరుమల పార్వతి ఇంటితో పాటు, కుమారుడు గోవింద్ నివాస గృహం, పక్కనే నివాసం ఉంటున్న రమణయ్యకు చెందిన నివాస గృహాలు అగ్ని ప్రమాదలో పూర్తిగా కాలిపోయి, సుమారు రూ.3లక్షలు విలువచేసే ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు. అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబాలకు సీపీఐ నాయకులు మారుతీ వరప్రసాద్, సీనియర్ నాయకులు చంద్రపాటి సైదా, బి.శ్రీనివాసరావు బాధితులను ఓదార్చి నిత్యావసరాలు దుస్తులు అందచేశారు.



తాగునీటి పైపులైన్ల మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ప్రత్తిపాటి

అధికారులు సమస్యలను పరిష్కరించాలి

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తాగునీరు, పారిశుధ్య నిర్వహణపై పట్టణ ప్రజల నుంచి ఫిర్యాదులు లేకుండా అధికారులు పనిచేయాలని శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం మునిసిపల్ అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరా పైప్ లైన్లు, డంపింగ్ యార్డ్‌ను పరిశీలించి మునిసిపల్ అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. వేసవి దృష్ట్యా తాగునీరు సక్రమంగా అందేలా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని, ఎక్కడికక్కడ పైపులైన్ల లీకేజీలను సరిచేసి, నీటివృథాను అరికట్టి, సురక్షిత నీరు ప్రజలకు అందించాలని సూచించారు. మురుగునీరు రోడ్లపైకి రాకుండా డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. బ్లీచింగ్, క్లోరినేషన్ ప్రక్రియలు సక్రమంగా జరగాలని, దోమల బెడద లేకుండా ఫాగింగ్ చేయాలని కోరారు. శారదా హైస్కూల్ పక్కన ఉన్న శ్మశాన వాటికను ఆధునీకరించాలని, కంపచెట్లు, వ్యర్థాలు తొలగించి ప్రజలకు ఉపయోగపడేలా చూడాలని కోరారు. డంపింగ్ యార్డు నిర్వహణలో అజాగ్రత్త, అశ్రద్ధ వహిస్తే సహించేది లేదని, చెత్త పేరుకుపోకుండా చూడాలని అధికారులకు సూచించారు. పొడిచెత్తను రీ సైకిల్ చేయడం, తడి చెత్తను విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లకు తరలించే ప్రక్రియ సజావుగా జరగాలన్నారు. ఎమ్మెల్యే వెంట మునిసిపల్ చైర్మన్ రఫాని, కమిషనర్ పి.శ్రీహరిబాబు, డీఈ షేక్ రహీం, టీడీపీ నాయకులు షేక్ కరీముల్లా, వీరారెడ్డి, పఠాన్ సమద్ ఖాన్ ఉన్నారు.

చికిత్సపొందుతూ వలస కార్మికుడు మృతి



మృతిచెందిన శశికాంత్‌దాస్

యడ్లపాడు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పురుగు మందుతాగి వలస కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై మంగళవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రం భద్రక్ జిల్లా కాన్సాడ్ గ్రామానికి చెందిన శశికాంత్‌దాస్(22)కు తన వివాహ విషయంలో తల్లిదండ్రులతో విభేదాలు ఏర్పడి ఇటీవల ఇల్లు వదిలి ఏపీకి వచ్చాడు. స్నేహితుడు బృందావన్ మాలిక్ సహకారంతో యడ్లపాడు పరిధిలోని ఓ నూలు మిల్లులో కార్మికుడిగా చేరాడు. ఆదివారం రాత్రి బయటకు వెళ్ళిన శశికాంత్‌దాస్ కొద్దిసేపటి తరువాత మిల్లులోని క్వార్టర్‌కు వచ్చి వాంతులు చేసుకుంటుండగా గమనించిన స్నేహితుడు బృందావన్ మాలిక్ కంపెనీ వారికి సమాచారం ఇచ్చి కంపెనీ అంబులెన్స్‌లో స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్ళారు. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున శశికాంత్ మృతిచెందాడు. సమాచారం అందుకున్న మృతుని సోదరుడు మంగళవారం యడ్లపాడు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

న్యాయాధికారి సత్యశ్రీకి డాక్టరేట్




పట్టా స్వీకరిస్తున్న న్యాయాధికారి సత్యశ్రీ

నరసరావుపేట లీగల్, మార్చ్ 25 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట 13వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయ అధికారి నేతి సత్యశ్రీకి ఆంధ్ర విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ అందజేసింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కాలేజ్ ఆఫ్ లా, ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి వైస్-చాన్సలర్ ప్రొఫెసర్ పీఎస్ రాజశేఖర్ నుంచి న్యాయశాస్త్రంలో డాక్టరేట్ డిగ్రీని పొందారు. ఎన్.సత్యశ్రీ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కాలేజ్ ఆఫ్ లా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.సీతామాణిక్యం పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తిచేశారు. 'ఎన్నికలలో తప్పుడు సమాచారాన్ని బహిర్గతం చేయడం ఎన్నికలలో ప్రచారాలు! సాంకేతిక యుగంలో చట్టపరమైన, నైతిక సందిగ్ధతలు' అనే అంశంపై పరిశోధన చేశారు. ప్రస్తుత ఏఐ యుగంలో ఎన్నికల ప్రచారాలలో చోటు చేసుకుంటున్న అపసవ్యతలు శాస్త్రీయంగా వాటిని సరిదిద్దుకోవడానికి తీసుకోవలసిన చర్యలు మీడియా పాత్ర వ్యక్తిగత స్వేచ్ఛ తదితర అంశాలను స్పృశిస్తూ ఆమె ఈ పరిశోధన చేశారు.

క్రికెట్ బుకీలపై చర్యలు తీసుకోవాలి: పీడీఎం

నరసరావుపేట టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ బుకీలపై చర్యలు తీసుకోవాలని, ఆన్‌లైన్ యాప్‌లు నిషేధించాలని పీడీఎం రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం నరసరావుపేట పట్టణంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఐపీఎల్ క్రికెట్ సీజన్ నేపథ్యంలో బెట్టింగ్ కార్యకలాపాలకు అమాయక ప్రజలను, యువతను లక్ష్యంగా చేసుకొని క్రికెట్ బెట్టింగ్ ద్వారా ఎక్కువ డబ్బు సంపాదించవచ్చునని ప్రలోభ పెట్టి క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నారని అన్నారు. అలాంటి వారిని శిక్షిస్తామని, ఐపీఎల్ క్రికెట్ సీజన్ నేపథ్యంలో ప్రభుత్వ అధికారులు ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. హైదరాబాద్ కేంద్రంగా చేసుకొని క్రికెట్ బుకీలు బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నారని చెప్పారు. గతంలో నరసరావుపేట ప్రాంతంలో బెట్టింగ్ నిర్వహించే క్రికెట్ బుకీ గోల్డ్‌శేఖర్ వివరాలు అధికారులకు తెలియజేసిన ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. వడ్డీ వ్యాపారుల ఒత్తిడి, పర్సనల్‌లోన్ పేరుతో ఆన్‌లైన్ వడ్డీ వ్యాపారాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో పీడీఎం నాయకుడు ఎస్.రామారావు, థామస్, బీసీ సంఘం నాయకుడు బాదుగున్నల శ్రీనివాసరావు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కె.అమల కుమారి

ప్రకృతి వ్యవసాయ విధానాన్ని పాటించండి

● జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమల కుమారి

చిలకలూరిపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ కార్యాచరణలో భాగంగా ప్రతి ఒక్క రైతు పీఎండీఎస్ (నవధాన్య) విధానాన్ని అమలు చేయాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె అమలకుమారి పిలుపు ఇచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల స్థాయిలో వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ అనుబంధ శాఖలు, వెలుగు సిబ్బంది, ప్రకృతి వ్యవసాయశాఖల అధికారులతో మండల స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో అమలకుమారి మాట్లాడుతూ ఈ విధానం వలన భూమి సారవంతం కావడమే కాకుండా వేసవి కాలంలో వారి కుటుంబ అవసరాలకు కావలసిన ఆకుకూరలో కూరగాయలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలోస్టేట్ ఎస్ ఎఫ్ ఏ ఉషారాణి, మండల సీసీలు, జిల్లా సిబ్బంది సౌజన్య, స్వాతి మల్లీశ్వరి, యూనిట్ ఇంచార్జ్ ఐలయ్య. ఉమా దేవి. మధు వాణి. అనూష, రైతులు పాల్గొన్నారు.